J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 40 సంచిక : 41 12.3.2021, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి



## ముదిరిన వివాదం.. విశాఖ ఉక్కు

# ఇది జగన్‌కు విషమ పరీక్షే!



విశాఖ ఉక్కు వివాదం ముదిరి పాకాన పడింది. ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కు తగ్గేది లేదంటూ కేంద్ర విత్తమంత్రి నిర్మలమ్మ ప్రకటించడం, ఆమెకు తోడు సహాయ మంత్రి అనురాగ్ వంత పాడడంతో ఉక్కు కర్మాగారానికి రోజులు దగ్గర పడ్డట్టు స్పష్టమైపోయింది.

విశాఖ ఉక్కు వ్యవహారంలో ఆంధ్రా ప్రభుత్వానికి మద్దతుగా నిలుస్తాం అని తెలంగాణ యువ రాజు కేటిఆర్ ప్రకటన...

'విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు', ఈ హక్కు కోసం పోరాడదాం.. అంటూ మెగాస్టార్ చిరంజీవి చేసిన ట్వీట్...

ఉక్కు కర్మాగారం విషయంలో పునరాలోచించాలని... తాను ప్రధానమంత్రిని కోరతానని బీజేపీ యంపీ సుబ్రహ్మణ్యస్వామి జగన్మోహన్‌రెడ్డికి ఇచ్చిన హామీ... ఉక్కు ఉద్యమానికి బలం చేకూరుస్తున్నాయి.







ఏ రాజకీయ పార్టీకైనా ప్రతిపక్షంలో ఉంటే... ఏ బాదరబందీ ఉండదు. ఏదిబడితే అది మాట్లాడవచ్చు. అధికారంలో ఉన్న వారితో చెడుగుడు ఆడుకోవచ్చు. ఆ ఆటకు రూల్స్ అంటూ ఏమీ ఉండవు. చేసిందే విమర్శ... కొట్టిందే సిక్సర్ అన్నట్టుగా ఉంటుంది. మీడియా కవరేజ్ కూడా అదిరిపోతుంది.

ప్రతిపక్షం నుంచి అధికారంలోకి వస్తేనే అసలైన కష్టం. అన్నీ పరిమితులే. చాలీచాలని పంచెను కట్టుకుంటే... ఏ పక్కన ఊడిపోతుందో తెలియక గందరగోళంలో పడిపోయినట్టుంటుంది.

ఆంధ్రప్రదేశ్‌లో 151 సీట్లతో 2019లో అధికారం చేపట్టిన జగన్మోహన్‌రెడ్డికి ఇప్పటిదాకా – చేసిందే శాసనంగా చెల్లిపోయింది. ఫ్యాన్ గాలికి తెలుగుదేశం, బీజేపీ, జనసేనలకు ఊపిరాడకుండా పోయినట్టయింది. జగన్ దూకుడును తట్టుకోవడం ఈ పార్టీలకు అయ్యేపని కాదనే భావన కూడా బలంగా జనంలోకి వెళ్ళిపోయింది.

ఇక, విశాఖకు రేపో.. మాపో రాష్ట్రస్థాయి పాలనా యంత్రాంగాన్ని తరలించడం ఖాయం అనుకుంటున్న సమయంలో విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ విషయం బయటపడింది. అగ్నికి ఆజ్యం పోసినట్టుగా– మొత్తం ఫ్యాక్టరీని నూటికి నూరు శాతం అమ్మి పడేస్తాం అంటూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రకటించడంతో ఆంధ్రదేశం బిత్తరబోయింది. కొంటానికి ఎవరూ ముందుకు రాకపోతే... మూసిపడేస్తాం అంటూ ఆర్థికశాఖ సహాయమంత్రి అనురాగ్ ఠాగూర్ మరో ప్రకటన చేశారు. దీంతో తెలుగు సమాజం నిర్ఘాంతపోయింది. విశాఖ మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో ఓటింగ్ మరో రెండు, మూడు రోజుల్లో జరగనున్న కీలక సమయంలో ఈ ప్రకటనలు ఢిల్లీ నుంచి రావడంతో– వైసీపీతో పాటు జగన్ కూడా పూర్తి ఆత్మరక్షణలో పడిపోయినట్టు కనిపించింది. విశాఖకే ఈ ఆందోళన పరిమితం కాలేదు. రాష్ట్రం సరిహద్దులు దాటింది. తెలంగాణ మంత్రి కేటీఆర్ చాలా గట్టిగా స్పందించారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖలో జరుగుతున్న ఆందోళనలో అవసరమైతే స్వయంగా పాల్గొంటానని కేటీఆర్ ప్రకటించారు. బుధవారం నాడు ఆయన ప్రకటించిన కొద్ది సేపటికే మెగాస్టార్ కూడా గొంతు కలిపారు.

ఇది చాలా పెద్ద పరిణామం. రాజకీయ అంశాలపై చిరు ఇటీవల పెద్దగా స్పందించడం లేదు. అలాంటిది ఈ విషయంలో ప్రకటన చేయడం విశేషం.

ఇప్పుడు ఉక్కు ఫ్యాక్టరీ వ్యవహారంలో ఆయన స్పందించడం అన్నది ఆ ఉద్యమానికి జవసత్వాలు సమకూర్చుతుందనడంలో సందేహం అక్కర్లేదు. మరోవైపు టీటీడీపై అసత్య వార్తలు రాశారంటూ ఆంధ్రజ్యోతిపై 100కోట్ల పరువు నష్టం కేసు వేయడానికి ప్రత్యేక విమానంలో తిరుపతికి వచ్చిన భారతీయ జనతాపార్టీ యం.పి సుబ్రహ్మణ్యస్వామి అక్కడి నుండి నేరుగా తాడేపల్లి వెళ్లి జగన్మోహన్‌రెడ్డితో కలసి విందారగించి, ఉక్కు కర్మాగారం వ్యవహారంలో పునరాలోచన చెయ్యాలని తాను కేంద్ర ప్రభుత్వాన్ని కోరతానని చెప్పడం కూడా ఊహించని పరిణామం. ప్రత్యక్షంగా ఆయన కాషాయ పార్టీలో ఉన్నా, పరోక్షంగా ఆయన జగన్‌కు అండగా ఉన్నారని ఈ పర్యటన రుజువు చేస్తోంది. దీనితో, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిర్ణయాత్మక స్థాయిలో స్పందించవలసిన పరిస్థితి ముఖ్యమంత్రి జగన్‌కు ఏర్పడుతుంది. లేకపోతే, కేంద్రంతో ఆయన కుమ్మక్కు అయ్యారనే భావనలు రాష్ట్రవ్యాప్తంగా వ్యాపించే


11 లో






# మా నాన్నే... మా దైవం

## - కళాంజలి 'స్వర నీరాజనం'లో యస్.పి.చరణ్



బాలు తనయుడు భావోద్వేగానికి గురయ్యాడు. తన తండ్రి దివ్యలోకాలకేగిన అనంతరం ఆయన స్మృత్యంకంగా అనంత్ 'కళాంజలి' సంస్థ నిర్వహించిన 'స్వర నీరాజనం' కార్యక్రమంలో భారతీయ సినిమా గాయకులు యస్.పి.బాల సుబ్రహ్మణ్యం కుమారుడు యస్.పి. చరణ్ కంటతడి పెట్టుకున్నాడు. మా నాన్నే.. మా దైవం అంటూ.. తన తండ్రిని స్మరించుకున్నాడు. వీలున్నప్పుడల్లా తమ నాన్నకు జన్మనిచ్చి, జీవితాన్నిచ్చిన నెల్లూరుకు వస్తూనే ఉంటానన్నాడు.

5, 10లో

# దేదీప్యమానం.. దక్షిణ కైలాసం

## అంగరంగ వైభవంగా శ్రీకాళహస్తిలో 'మహా శివరాత్రి' బ్రహ్మోత్సవాలు

భక్తులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూసే 'మహా శివరాత్రి' బ్రహ్మోత్సవాలు ఆదిదంపతులైన ఆ పార్వతీపరమేశ్వరులకు నెలవై ఉన్న చిత్తూరుజిల్లాలోని శ్రీకాళహస్తిలో మార్చి 6వ తేదీ శనివారం నుంచి అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. దక్షిణ కైలాసంగా భాసించే శ్రీకాళహస్తిలో కొలువై ఉన్న శ్రీ జ్ఞానప్రసూనాంబికాదేవి సమేత శ్రీ శ్రీకాళహస్తీశ్వర స్వామిని దర్శించుకునేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో ఆలయానికి తరలివస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి తదితర అధికారులు, సిబ్బంది అంతా కలసి ఆలయాన్ని విద్యుద్దీపకాంతులతో శోభాయమానం చేశారు. ఆలయ అర్చకులు స్వామివారిని, అమ్మవారిని, ఉత్సవమూర్తులను సుగంధభరిత పుష్పాలతో అలంకరించి వేడుకగా వాహన సేవలు నిర్వహిస్తున్నారు. వేదపండితుల వేదమంత్రోచ్చారణల మధ్య, మంగళ వాయిద్యాల మధ్య, 'హరహర మహాదేవ.. శంభోశంకరా.. సదాశివా.. పరమశివా'.. అంటూ భక్తులు పెద్దపెట్టున చేస్తున్న శివ నామస్మరణల మధ్య స్వామివారి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఈ నెల 6వ తేదిన శ్రీ కన్నప్ప ధ్వజారోహణంతో అంకురార్పణ జరిగిన ఈ వేడుకల సంరంభం ఈనెల 18వ తేదీ వరకు వైభవోపేతంగా కొనసాగుతుంది. శ్రీకాళహస్తి పట్టణమంతా భక్త జనసందోహంతో నిండిపోతోంది. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు శ్రీకాళహస్తిలోని ధూర్జటి కళాప్రాంగణంలో మార్చి 6 నుంచి 18వతేదీ వరకు ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రదర్శనలు కూడా ఏర్పాటుచేశారు.




### వేడుకగా వాహనసేవలు

ఈ మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 7వ తేది ఉదయం శ్రీస్వామి వారి ధ్వజారోహణం, దేవరాత్రి ఉత్సవం ఎంతో వేడుకగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారికి అమ్మవార్లకు ఉదయం 10 గంటలకు, మళ్ళీ రాత్రి 9 గంటలకు వెండి అంబారీ వాహనసేవలు కన్నులపండువగా నిర్వహించారు. 8వతేదీ ఉదయం రెండవ తిరునాళ్ళలో భాగంగా సూర్యప్రభ వాహనం, చప్పరసేవ జరిగాయి. రాత్రి భూత వాహనం, శుకవాహన సేవలు జరిగాయి. 9వ తేది మూడవ తిరునాళ్ళలో హంస వాహనసేవ, యాళి వాహన సేవ, రాత్రి రావణసేవ, మయూర వాహన సేవలు జరిగాయి. 10న హంస వాహనసేవ, శుకవాహన సేవ, రాత్రి శేష వాహనోత్సవం, యాళి వాహనసేవలు నిర్వహించారు.


### పోటెత్తిన భక్తజనం :

ఈ ఉత్సవాల్లో భాగంగా 6వ రోజైన ఈనెల 11వ తేదీ గురువారం నాడు మహ శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు వేలసంఖ్యలో తరలిరావడంతో శ్రీకాళహస్తి పట్టణం భక్తజనసంద్రంగా మారింది. ఈ పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామివార్లకు ఉదయం 9 గంటలకు ఇంద్ర విమానం, చప్పరసేవ అత్యంత వైభవంగా నిర్వహించారు. రాత్రి 9.30 గంటలకు నంది వాహన సేవ, సింహ వాహనసేవలు నేత్రపర్వంగా చేపట్టారు. మహాశివరాత్రి నాడు పరమశివుని దర్శనం ఎంతో పుణ్యప్రదం కనుక భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చి ఆ మహాదేవుని దర్శించుకున్నారు. రాత్రి లింగోద్భవ కాల పూజలు నయనానందకరంగా జరిగాయి. అదేవిధంగా 12వ తేది ఉదయం రథోత్సవం, రాత్రి తెప్పోత్సవాలకు భక్తులు ఇసుకేస్తే రాలనంతగా తరలివచ్చారు. శ్రీకాళహస్తి పురవీధుల్లో స్వామివార్ల ఉత్సవ వేడుకలు కమనీయంగా రమణీయంగా జరిగాయి.

### కన్నులపండువగా కళ్యాణోత్సవం:

శ్రీకాళహస్తీశ్వరుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 13వ తేది శుక్రవారం శ్రీ స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం ఎంతో వైభవంగా జరగనుంది. ఈ సందర్భంగా ఉదయం అధికార నంది ఉత్సవం, కామధేనువు వాహనసేవలు, రాత్రి 9 గంటలకు ఏనుగు వాహనం, సింహ వాహనసేవలు నేత్రపర్వంగా జరుగనున్నాయి. 14వ తేదిన ఉదయం 11 గంటలకు రుద్రాక్ష అంబారి వాహనసేవ, రాత్రి 7 గంటలకు శ్రీ సభాపతి కల్యాణం నిర్వహించనున్నారు. 15న దక్షిణ కైలాసగిరి ప్రదక్షణోత్సవం ఉదయం 7.25 గంటలకు ప్రారంభం కానుంది. వేలాదిమంది భక్తులు ఈ ఉత్సవంలో పాల్గొని శివనామ స్మరణలు చేస్తూ గిరి ప్రదక్షణ చేసుకుని తరిస్తారు. ఈ సందర్భంగా స్వామివారికి అమ్మవార్లకు బనాత అంబారి వాహనసేవ, రాత్రి అశ్వవాహనసేవ, సింహవాహన సేవలు వేడుకగా జరుగనున్నాయి. 16వ తేది ఉదయం 8.45 గంటలకు తీర్థవారి ధ్వజావరోహణం, కేడిగ వాహనసేవ నిర్వహిస్తారు. 17వ తేదీ రాత్రి 8 గంటలకు పల్లకిసేవ ఉంటుంది. బ్రహ్మోత్సవాల ముగింపు సూచకంగా 18వ తేదిన రాత్రి 9 గంటలకు ఏకాంతసేవ నిర్వహిస్తారు. 19వ తేది ఉదయం 10.30 గంటలకు శాంతి అభిషేకంతో ఈ బ్రహ్మోత్సవాలు పరిసమాప్తి అవుతాయి.

---



## సౌమ్యుడు!.. సహృదయుడు!.. సేవాప్రియుడు!..

# 'ఆచార్య ఆదిత్య' అస్తమయం

*మంచి మనిషి..మానవీయమూర్తి..విద్యావేత్త..ఆదిత్య విద్యాసంస్థల అధినేత ఆచార్య ఆదిత్య(బాలినేని రామిరెడ్డి) అస్తమించారు. గత కొద్దికాలంగా అస్వస్థతకు గురై ఉన్న ఆయన ఈనెల 9వ తేది మంగళవారం సాయంత్రం, తన 76 ఏళ్ల వయసులో నెల్లూరు నగరంలోని జయభారత్ ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచారు. 10వ తేది బుధవారం ఆయన భౌతిక కాయానికి అంత్యక్రియలు జరిగాయి. ఎందరో విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రముఖులు, ప్రజలు ఆయనకు అశ్రునయనాలతో కడసారి వీడ్కోలు తెలిపారు. ఆయన మృతితో నెల్లూరు శోకతప్తమైంది. సింహపురి సీమ ఒక మంచి విద్యావేత్తను, సౌజన్యమూర్తిని కోల్పోయినట్లయింది.*

ఆయనో యోగి..! వివాహం చేసుకోకుండానే, లౌకిక వ్యవహారాల కన్నా ఆధ్యాత్మిక, సామాజిక, నైతిక విలువలకే ప్రాధాన్యతనిచ్చి ఆజన్మబ్రహ్మచారిగానే ఉంటూ సమాజ సముద్ధరణ కోసం జీవితాంతం పరితపించారు. విద్యావేత్తగా రాణిస్తూ తెలుగుభాషకు, భారతీయ సంస్కృతి సంప్రదాయాల పరివ్యాప్తికి క్షణం కూడా తీరికలేకుండా పరిశ్రమించారు. జిల్లా సాంస్కృతిక, సామాజిక, రాజకీయ రంగాల్లో తనదంటూ ఒక ప్రత్యేకముద్ర వేసుకుని ఆ రంగాల్లో ఎందరికో ఉత్సాహ ప్రోత్సాహాలనిచ్చి ఎందరికో గురువుగా, విశిష్ట ఆచార్యునిగా ప్రజలందరి విశేష మన్ననలు అందుకున్నారు.

### ఆర్ఎస్ఎస్ కార్యకర్తగా జీవిత ప్రస్థానం

ఆచార్య ఆదిత్య పుట్టింది ప్రకాశం జిల్లా సంతనూతలపాడు మండలంలోని బొద్దువారిపాలెం అనే చిన్నగ్రామంలో. వీరిది వ్యవసాయ కుటుంబం. తల్లిదండ్రులు బాలినేని వెంకమ్మ–వెంకటసుబ్బయ్యల ప్రథమసంతానంగా 1947 మార్చి 23వ తేదీన ఆదిత్య జన్మించారు. ఆయనకు ఇద్దరు చెల్లెళ్ళు కూడా ఉన్నారు. ప్రాథమిక విద్యాభ్యాసమంతా స్వస్థలమైన బొద్దువారిపాలెంలోనే జరిగింది. ఆ తర్వాత సంతనూతలపాడు హైస్కూలులోను, ఒంగోలు సివిఆర్ కాలేజీలోనూ చదువుకున్నారు. ప్రత్యేకించి ఆయన ఆంగ్లభాషలోనూ, గణితశాస్త్రంలోనూ ప్రవీణులు. చదువుకునే రోజులనుంచే ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాల పట్ల ఆకర్షితుడై ఆర్ఎస్ఎస్ కార్యకర్తగానే అసలైన జీవితప్రస్థానం ప్రారంభించారు. అచంచలమైన దేశభక్తితో నిరంతరం భరతమాత సేవలో పునీతమయ్యారు. 1970వ దశకంలో చిత్తూరుజిల్లా ఆర్ఎస్ఎస్ ప్రచారక్‌గా, గుంటూరుజిల్లా నరసరావుపేటలో ప్రచారక్‌గా ఎంతో నిబద్ధతతో పనిచేశారు. ఎమర్జెన్సీ రోజుల్లో జైలుశిక్ష కూడా అనుభవించారు. ఎందరో ప్రముఖులతో, సమాజసేవకులతో, ఆయనకు సన్నిహిత సంబంధాలుండేవి. నెల్లూరుకు వచ్చి స్థిరపడ్డాక తన జీవితాన్ని విద్యారంగానికి అంకితంచేసి తద్వారా సమాజాభ్యున్నతికి తనవంతు సేవలందించడం ప్రారంభించారు. పుట్టింది ప్రకాశంజిల్లాలోనే అయినా నెల్లూరుమీద ఎనలేని అభిమానంతో సేవలందిస్తూ.. నెల్లూరీయునిగానే ఆయన ప్రకాశించారు.

### విద్యారంగంలో తనదైన ముద్ర :

1980 ప్రాంతంలో నెల్లూరు నగరంలో 'మ్యాథ్స్ అండ్ ఇంగ్లీష్ గ్రామర్ అకాడమీ' అనే పేరుతో స్వయంగా విద్యాసంస్థ స్థాపించి, ఆ విద్యాలయాన్ని క్రమశిక్షణకు, ప్రతిభాపాటవాలకు నిలయంగా, చదువులతల్లికి ఆలయంగా రూపుదిద్దారు. ఆదిత్య కోచింగ్ సెంటర్‌గా ఆ విద్యాలయం ఎంతో ప్రఖ్యాతి చెందింది. పాలిటెక్నిక్, ఏపిఆర్‌జెసి కోచింగ్‌లలో రాష్ట్రంలోనే మొదటి ర్యాంకులు తెచ్చుకున్న విద్యాసంస్థ అది. తానే ఉపాధ్యాయుడుగా ఉంటూ విద్యార్థులను భావిభారత పౌరులుగా, ప్రయోజకులుగా తీర్చిదిద్దారు. 'ఆచార్య ఆదిత్య' అంటే నైతిక విలువలకు, క్రమశిక్షణకు కట్టుబడిన ఉత్తమోత్తమ గురువుగా, మంచికి మారుపేరుగా నిలిచారు. ఆ తర్వాత అదేస్ఫూర్తితో 1990లో డిగ్రీ కళాశాలను, 1992లో జూనియర్ కళాశాలను, 1999లో పీజీ కళాశాలను కూడా అంచలంచెలుగా స్థాపించి జిల్లా విద్యారంగంలో తనదైన ముద్రతో రాణించి 'ఆదిత్య విద్యాసంస్థల'ను సరస్వతీ నిలయాలుగా ప్రకాశింపజేసి, ఆ విద్యాలయాలన్నిటినీ వెలుగుబాటలో నడిపించారు. నెల్లూరులోని చిల్డ్రన్స్‌పార్కు సమీపంలో ఈ విద్యాలయాలున్న ప్రాంతం 'ఆదిత్య నగర్'గా కూడా ప్రసిద్ధి. వీటన్నిటి వెనుక అవిశ్రాంత యోధునిగా ఆయన పడిన కష్టం.. నిరంతర శ్రమను వర్ణించడానికి మాటలు చాలవు. తమ విద్యాలయాల్లో తక్కువ ఫీజుతోనే నాణ్యమైన విద్య బోధించేవారు. అంతేకాదు 1995 నుంచి 2005 దాకా దాదాపు పదేళ్ళపాటు ఆయన నెల్లూరు జిల్లా ప్రైవేట్ డిగ్రీకళాశాలల సంఘానికి అధ్యక్షునిగా ఉంటూ అన్ని కళాశాలల వారిని ఒక తాటిపైకి తెచ్చిన ఘనత ఆయనకే దక్కిందంటే అతిశయోక్తి కాదు.

### తెలుగుభాషాభిమానిగా సేవలు :

తీయనైన తెలుగుభాష అంతరించిపోకుండా పరిరక్షించుకోవడం కోసం నెల్లూరులో తెలుగుభాషోద్యమ సమితిని స్థాపించి పార్టీలకతీతంగా ఆయనెన్నో కార్యక్రమాలు నిర్వహించారు. అన్నిటికీ మించి మన ప్రాచీన సంస్కృతి సంప్రదాయాలను ఎంతగానో గౌరవిస్తూ, విద్యార్థులకు యువతకు అందరికీ వాటి ఔన్నత్యాన్ని పదేపదే వివరించేవారు. స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకుని వివేకానంద సేవా సమితిని స్థాపించి విద్యార్థులను, యువతను దేశభక్తి వైపు నడిపించారు. ఆయన సమాజసేవలకు మెచ్చిన ఎన్నో సంస్థలవారు, ప్రముఖులు ఆయన్ను ఎంతో గౌరవంతో సత్కరించేవారు. అదేవిధంగా ఆయన కూడా ఎంతోమంది కళాకారులు, సాహితీ వేత్తలు, భాషాభిమానులు, సమాజసేవకులను ప్రోత్సహిస్తూ సన్మానించేవారు. నెల్లూరులో పర్యావరణ పరిరక్షణ సమితి, భారత వైజ్ఞానిక్ సంఘ్ వంటి సంస్థలను స్థాపించి వాటిని అత్యున్నతమైనరీతిలో నిర్వహించారు. స్వతహాగా ఆయన సౌజన్యమూర్తి. ఎప్పుడూ చెరగని చిరునవ్వుతో, కల్లాకపటం లేకుండా, చిన్నాపెద్దా తారతమ్యం చూడకుండా అందరినీ ఆత్మీయంగా పలకరించే సహృదయం.. ఆయన సొంతం. 'లాయర్'కు కూడా ఆయనెంతో సన్నిహితులు. సమాజాన్ని తీర్చిదిద్దే ఉత్తమ ఆచార్యునిగా మహనీయమైన సేవలందించిన సమాజసేవాభిలాషి, ప్రత్యేకించి ఎన్నో విశిష్టమైన విద్యాసంస్థలకు పేరు మోసిన నెల్లూరు విద్యారంగంలో ఇంతకాలం ఆదిత్యునిలాగే ప్రకాశించిన ఆచార్య ఆదిత్య గారు మనమంచి దూరం కావడం ఎంతో బాధాకరం. ఆ ఆదర్శమూర్తి మృతికి అశ్రునయనాలతో నివాళులర్పిస్తోంది...'లాయర్'!...


### ఉపరాష్ట్రపతి వెంకయ్య పరామర్శ

ఆచార్య ఆదిత్య కుటుంబసభ్యులను భారత ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఢిల్లీ నుండి ఫోన్‌లో పరామర్శించారు. ఆచార్య ఆదిత్యతో తనకున్న సుదీర్ఘ అనుబంధాన్ని ఈ సందర్భంగా వెంకయ్య గుర్తు చేసుకున్నారు. క్రమశిక్షణకు, కార్యదక్షతకు మారుపేరుగా నిలిచిన ఆదిత్య, భావితరాలకు ఆదర్శం అని, ఆయనను కోల్పోవడం చాలా బాధాకరమని వెంకయ్యనాయుడు తన విచారాన్ని వ్యక్తం చేశారు.

### మంత్రి మేకపాటి శ్రద్ధాంజలి

రాష్ట్ర పరిశ్రమల శాఖామంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి ఆదిత్య భౌతికకాయాన్ని సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు. ఎంతోమంది భావిభారత పౌరులను ఉత్తమోత్తమంగా తీర్చిదిద్దిన ఆదిత్య గారి మరణం విద్యారంగానికి తీరని లోటని గౌతమ్‌రెడ్డి అన్నారు. అలాగే జిల్లాలోని పలువురు నాయకులు, ప్రముఖులు ఆదిత్య భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

# బల్లి కళ్యాణ్ 'ఎమ్మెల్సీ'



మార్చి 8వ తేదీ సోమవారం నాడు ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికై డిక్లరేషన్ తీసుకుంటున్న స్వర్గీయ బల్లి దుర్గాప్రసాద్ కుమారుడు బల్లి కళ్యాణ్ చక్రవర్తి

## 'ఆధార్' సేవలపై...
# ఆదాల ప్రశ్నలు



ఆధార్‌కార్డు సేవలు ఉచితంగా అందజేసే ప్రతిపాదన కేంద్ర ప్రభుత్వానికి ఉందా? అని నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఈనెల 10న లోక్‌సభలో ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా ఎన్ని ఆధార్ సేవా కేంద్రాలు పనిచేస్తున్నాయి? వాటి ద్వారా ఎన్ని రకాల సేవలు అందుతున్నాయని కూడా ప్రశ్నించారు. దీనికి కేంద్ర ఎలక్ట్రానిక్స్ సమాచార సాంకేతిక శాఖ మంత్రి సంజయ్ ధోత్రే రాతపూర్వకంగా సమాధానమిచ్చారు. దేశవ్యాప్తంగా 55950 ఆధార్ సేవా కేంద్రాలు పనిచేస్తున్నాయని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1790 ఆధార్ సేవా కేంద్రాలు సేవలు అందజేస్తున్నాయని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ద్వారా 506, బ్యాంకుల ద్వారా 678, బిఎస్ఎన్ఎల్ ద్వారా 55, డిఓపిల ద్వారా 471, సిఎస్‌సిల ద్వారా 55, ఆధార్ సేవా కేంద్రాల ద్వారా 25, మొత్తంగా 1790 సేవా కేంద్రాలు పనిచేస్తున్నాయని తెలిపారు. ప్రస్తుతానికి ఈ కేంద్రాల ద్వారా ఆధార్ నమోదు, డెమోగ్రాఫిక్ అప్డేట్, బయోమెట్రిక్ అప్డేట్, ఆధార్ డౌన్లోడ్, ప్రింట్ అవుట్, ఈ-ఆధార్ సేవలు లభ్యమవుతున్నాయని పేర్కొన్నారు. 5 నుంచి 15 ఏళ్ల వయసు వారికి ఆధార్ సేవలు ఉచితంగా లభిస్తాయని తెలిపారు. ఇతర నమోదులకు నామమాత్రపు ఫీజును వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు.

# శ్రీసిటీలో ట్రైనీ ఐఏఎస్‌లు



2019 బ్యాచ్ ఆంధ్రా క్యాడర్‌కు చెందిన పది మంది ఐఎఎస్ ప్రొబేషనర్స్ (అసిస్టెంట్ కలెక్టర్లు) సభ్యుల బృందం తమ అధ్యయన పర్యటనలో భాగంగా ఈ నెల 9న శ్రీసిటీని సందర్శించింది. శ్రీసిటీ ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి వారికి సాదరస్వాగతం పలికి, శ్రీసిటీ ఎలా అభివృద్ధి సాధించిందో వివరించారు. ఈ సందర్భంగా శ్రీసిటీ నిర్మాణ దశలో ఎదుర్కొన్న కొన్ని అవరోధాలు, అనుసరించిన వ్యూహాలు, విలువైన అనుభవాలను తమతో పంచుకున్నందుకు వారంతా శ్రీసిటీ ఎం.డికి కృతజ్ఞతలు తెలిపారు.

## జెఇఇ మెయిన్స్‌లో..
# విశ్వసాయి విజయకేతనం



జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో నెల్లూరులోని మాగుంట లేఅవుట్‌లో ఉన్న విశ్వసాయి విద్యాసంస్థల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. తమ కళాశాల విద్యార్థులు 14మంది 90పర్సెంటైల్ కంటే ఎక్కువగా, మరో 40మంది విద్యార్థులు 80పర్సెంటైల్ కంటే ఎక్కువగా సాధించారని కళాశాల ఛైర్మెన్ డా.ఎస్.సత్యనారాయణ తెలిపారు. టి.పురంధేశ్వర్‌రెడ్డి(96.76), డి.కార్తికేయ(96.59), వై.విద్య(95.61), ఐ.వేదసాయి ప్రియ(95.06) ఉత్తమ పర్సంటైల్స్ సాధించారని పేర్కొన్నారు. మంచి ప్రతిభ కనపరచిన తమ కళాశాల విద్యార్థులందరినీ ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్‌ఛైర్మెన్ జి.కృష్ణమోహన్, డైరెక్టర్లు, ప్రిన్సిపాల్స్ తదితరులు పాల్గొన్నారు.

# వెంకన్న సేవలో 'నాయుడు గారి కుటుంబం'



భారత ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు కుటుంబ సమేతంగా శ్రీవారిని దర్శించుకున్నారు. మార్చి 5వ తేదీ ఉదయం సాధారణ భక్తుడిలాగే వెంకయ్య క్యూలైన్‌లో స్వామివారి దర్శనానికి వెళ్లారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో వెంకయ్య కుటుంబసభ్యులను వేద పండితులు ఆశీర్వదించారు. వెంకయ్య - శ్రీమతి ఉషమ్మ దంపతులతో పాటు కుమారుడు హర్షవర్ధన్, కోడలు రాధ, మనుమరాళ్ళు నిహారిక, వైష్ణవి, కుమార్తె దీప, అల్లుడు వెంకట్, మనుమడు విష్ణు, మరో మనుమరాలు సుష్మ స్వామివారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు.

# 'కృషి ఉడాన్' పథకం లక్ష్యాలేమిటి?..

## రాజ్యసభలో ప్రశ్నించిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి



'కృషి ఉడాన్' పథకం లక్ష్యాలేమిటి?.. ఈ పథకం ఆపరేషన్ గ్రీన్స్ నుండి ఎలా భిన్నంగా ఉంటుంది. అన్ని రాష్ట్రాలకు 50 శాతం సరుకు రవాణా రాయితీని ఇవ్వాలని కేంద్రమంత్రిత్వశాఖ పరిశీలిస్తోందా? లేకపోతే అందుకు గల కారణాలేమిటి? ప్రస్తుతం ఉన్న 22 అంశాలకు ఆపరేషన్స్ గ్రీన్స్ కింద మరిన్ని అంశాలను చేపట్టేందుకు ఏమైనా ప్రణాళికలున్నాయా?.. అంటూ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఈనెల 10న రాజ్యసభలో ప్రశ్నల వర్షం కురిపించారు.

అందుకు స్పందించిన కేంద్ర సివిల్ ఏవియేషన్ సహాయమంత్రి హర్దీప్‌సింగ్ పూరి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. కృషి ఉడాన్ పథకం లక్ష్యాలు పౌర విమాన యానశాఖకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ముఖ్యంగా ఈశాన్య, గిరిజన జిల్లాలో మెరుగైన చైన్ సరఫరా పోటీతత్వంతో పాటు మరింతగా వాయుమార్గాల ద్వారా విమానాశ్రయాలను ఏర్పాటు చేయడం, సరసమైన ధరలతో అంతర్జాతీయ మరియు జాతీయ మార్గాలను అభివృద్ధి చేసేందుకు ఈ పథకం తోడ్పడుతుందని పేర్కొన్నారు. ఆపరేషన్స్ గ్రీన్ అనే పథకం 5వందల కోట్ల రూపాయలతో ఫుడ్‌ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రిత్వశాఖ ద్వారా 2018-19 సంవత్సరం కేంద్ర బడ్జెట్‌లో ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఈ పథకం రైతులకు, ఉత్పత్తిదారుల సంస్థలు, అగ్రి-లాజిస్టిక్స్, ప్రాసెసింగ్ సౌకర్యాలు మరియు వృత్తిపరమైన నిర్వహణను ప్రోత్సహించడం ద్వారా టొమాటో, ఉల్లిపాయ, బంగాళాదుంపలకు సమగ్ర అభివృద్ధితో కూడిన విలువలను అందజేసేందుకు నిర్దేశించడం జరిగిందని వివరించారు. ఆత్మనిర్భర్ భారత్ అభియాన్ పథకంలో భాగంగా ఆపరేషన్స్ గ్రీన్ పరిధిలోని టొమాటో, ఉల్లిపాయలు, బంగాళాదుం పల నుండి పండ్లు, కూరగాయలకు కూడా విస్తరించారని పేర్కొన్నారు. కొన్ని షరతు లకు, పరిమితులకు లోబడి మిగులు ఉత్పత్తి ప్రాంతాల నుంచి వినియోగ కేంద్రాలకు, స్టోరేజ్ ప్రాంతాలకు రోడ్డు రవాణా శాఖకు 50 శాతం సబ్సిడీ అందజేసేందుకు నిర్ణయించడం జరిగిందన్నారు. అపరేషన్ గ్రీన్స్ పథకం మార్గదర్శకాలను గత ఏడాది నుంచి సవరించామని, సరళీకృత మరియు దేశీయ వాయురవాణా, నిల్వ సబ్సిడీ అవసరానికి అనుగుణంగా ఉండేలా పథకాల మధ్య అనుసంధానం సాధించడానికి కృషి ఉడాన్ పథకం తోడ్పడుతుందని వివరించారు.

### ఔషధ మొక్కల సాగుపై ప్రశ్నలు

దేశంలో ఔషధ మొక్కల (మూలికా సాగు)ను ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలేమిటని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఈనెల 9న రాజ్యసభలో లిఖితపూర్వకంగా ప్రశ్నించారు. దేశంలో మూలికా కేంద్రాలను ప్రభుత్వం గుర్తించిందా, అయితే దాని వివరాలేమిటి?.. ఆత్మనిర్భర్ ప్యాకేజీ కింద 4వేల కోట్లతో రానున్న రెండేళ్ళలో మూలికా సాగును 10 లక్షల హెకార్టకు విస్తరించాలని ప్రభుత్వం ఆలోచిస్తోందా?.. ఏపీలోని చిత్తూరుజిల్లా శేషాచలం అడవుల్లో ఔషధమొక్కలు విస్తారంగా ఉన్నందువల్ల ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారా?. అని ఆయన ప్రశ్నించారు. అందుకు స్పందించిన కేంద్రమంత్రి కిరెన్ రిజిజు సమాధానమిస్తూ ఆయుష్ మంత్రిత్వశాఖ, భారతప్రభుత్వం ఈ పథకాన్ని నేషనల్ ఆయుష్ మిషన్‌గా అమలు చేస్తోందని, ఆ పథకం గుర్తించిన క్లసర్లలో ఎంచుకున్న రాష్ట్రాలవారీగా ఆయా జిల్లాల్లో ప్రాధాన్యత కలిగిన మార్కెట్ ఆధారిత ఔషధమొక్కల సాగును అమలు చేయడం జరుగుతుందని, మొత్తం 56,396 హెక్టార్ల విస్తీర్ణంలో ఔషధ మొక్కలు సాగుచేసేందుకు ప్రతిపాదించడం జరిగిందని తెలిపారు. ఈ ఔషధ మొక్కల సాగును ఆత్మనిర్భర్ ప్యాకేజీ కింద ప్రోత్సహించడానికి 4వేల కోట్ల రూపాయల పెట్టుబడిని కూడా ప్రతిపాదించడం జరిగిందన్నారు. ఆయుష్ మంత్రిత్వ శాఖ ముసాయిదా పథకం 'ప్రధానమంత్రి వృక్ష్ ఆయుష్ యోజన' కింద సిద్ధమైందని, ఈ పథకం దేశవ్యాప్తంగా అమలు చేసేందుకు కేంద్ర మంత్రివర్గం పరిశీలనలో ఉందని వివరించారు.







## 'ప్రభా'తం

# 'ఐరాస'లో మన 'మిల్లెట్స్'

మిల్లెట్స్ (చిరుధాన్యాలు)కు ఇప్పుడు అంతర్జాతీయ ఖ్యాతి వచ్చింది. ప్రధాని మోడీ చొరవతో మనదేశం పెట్టిన 'మిల్లెట్స్ తీర్మానం' ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా అందరి అభినందనలు అందుకుంటోంది. భారత్ ప్రతిపాదించిన తీర్మానాన్ని ఆమోదిస్తూ 2023వ సంవత్సరాన్ని 'చిరుధాన్యాల ఏడాది'గా ఐక్యరాజ్యసమితి ప్రకటించడం ఎంతో విశేషం. బంగ్లాదేశ్, కెన్యా, నేపాల్, నైజీరియా, సెనెగల్, రష్యా దేశాలతో కలిపి భారత్ ఈ నెల 3న ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టగా మరో 70 దేశాలు అందుకు మద్దతు తెలిపాయి. దాంతో 'అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం 2023' (ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ మిల్లెట్స్) అనే పేరుతో భారత్ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని 193 సభ్యదేశాల సర్వప్రతినిధుల సభ ఏకగ్రీవంగా ఆమోదించడంతో.. అంతర్జాతీయస్థాయిలో భారత్ ఘనకీర్తిని మరోసారి చాటినట్లయింది. ఒక్క మనదేశానికే కాదు.. ప్రపంచ మానవాళికంతటికీ ఉపయోగపడే 'మిల్లెట్స్'పై దృష్టి సారిస్తూ మనదేశం ప్రవేశపెట్టిన తీర్మానం ఇలా ఏకగ్రీవంగా అన్నిదేశాల ఆమోదం పొందడం ఎంతో విశేషం.. ఇది భారతదేశానికి ఈ అపూర్వమైన గౌరవం కూడా.

తృణధాన్యాలన్నా చిరుధాన్యాలన్నా ఒకటే. ఆంగ్లంలో 'మిల్లెట్స్' అంటారు. జొన్నలు, సజ్జలు, రాగులు, కొర్రలు, వరిగెలు వంటి చిరుధాన్యాలు ఈనాటికీ దేశంలో బాగా వాడుకలో ఉన్నాయి. చిరుధాన్యాల వల్ల కలిగే ప్రయోజనాలపైనా, వాతావరణ మార్పులకు అనుగుణంగా వాటి సాగుకు జరగాల్సిన వ్యవసాయం పైనా అన్నిదేశాల వారిలో చైతన్యం పెంచడమే ధ్యేయంగా భారత్ ఈ తీర్మానం రూపొందించింది. దీంతో ప్రపంచంలోని అనేక దేశాల్లో చిరుధాన్యాల సాగును ప్రోత్సహించినట్లవుతుంది. అంతేకాదు, చిరుధాన్యాలను పండించే వ్యవసాయ రంగానికి, దాని అనుబంధ రంగాల అభివృద్ధికి కూడా ఊతమిచ్చినట్లవుతుంది. అన్ని రకాలుగా మానవాళి ఆరోగ్యానికి సంబంధించి..ఇదో మంచి పరిణామం. అందుకే ఇంతటి ఆరోగ్యకరమైన తీర్మానానికి మద్దతునిచ్చి సహకరించిన దేశాలన్నిటికీ ప్రధాని మోదీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు ప్రకటించారు. ఇంతకన్నా శుభసందర్భం ఇంకేం కావాలి?.. ఈ సందర్భంగా ఐరాసాలో మన మిల్లెట్స్‌కు మహదవకాశం దక్కింది. మనవాళ్ళు మిల్లెట్స్‌తో ఎంతో రుచికరంగా తయారుచేసిన 'మురుకులు'ను ఐక్యరాజ్యసమితికి చెందిన అన్ని సభ్యదేశాల వారికి అల్పాహారం(స్నాక్స్)గా అందించి అందరి అభినందనలు అందుకున్నారు.

'వాస్తవానికి చిరుధాన్యాల సాగుకు విస్తృత చారిత్రక ప్రాధాన్యం ఉంది. అయితే అనేక దేశాల్లో నానాటికీ వీటి వినియోగం తగ్గిపోయి వాటి ఉత్పత్తి కూడా క్షీణించిపోతూ ఉంది. చిరుధాన్యాల పోషక విలువలు, పర్యావరణ ప్రయోజనాలపై వినియోగదారులు, ఉత్పత్తిదారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఇప్పుడెంతైనా ఉంది'.. అని ఐక్యరాజ్యసమితిలో భారత్ శాశ్వత ప్రతినిధి టిఎస్ తిరుమూర్తి ఈ సందర్భంగా స్పష్టంగా చెప్పడం అన్నిదేశాలనూ ఆకట్టుకుంది. అంతేకాదు, అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరాన్ని నిర్వహించడం ద్వారా వాటి ఉత్పత్తిపై ప్రజల్లో, సాగుదారుల్లో మంచి చైతన్యం వస్తుందని కూడా చెప్పారాయన. ఇకనుంచీ చిరుధాన్యాల ఉత్పత్తి సామర్థ్యంతో పాటు పరిశోధన, అభివృద్ధి, పెట్టుబడులు, ఆహారరంగాల అనుసంధానాలు అనే అంశాలు కూడా మరింత విస్తృతం కావాలని, రానున్న 2023వ సంవత్సరాన్ని 'అంతర్జాతీయ చిరుధాన్యాల ఏడాది'గా గుర్తించడం ద్వారా ఆహారభద్రత, పోషణ, రైతుల జీవనోపాధి, ఆదాయాలు, పేదరిక నిర్మూలన, సుస్థిర అభివృద్ధి వంటి అనేక అంశాలు దీంతో ముడిపడి ఉన్నాయని, ఆ లక్ష్యాల సాధనకు ఇదెంతగానో తోడ్పాటునందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. చిరుధాన్యాల వినియోగాన్ని, ఉత్పత్తిని బాగా పెంచడం ద్వారా వైవిధ్యమైన, సంతులితమైన ఆరోగ్య ఆహారానికి తోడ్పాటు అందించవచ్చని ఆ తీర్మానంలో పేర్కొన్నారు. దీంతో చిరుధాన్యాల విస్తృత జన్యు వైవిధ్యానికి కూడా వీలుంటుందని పేర్కొన్నారు. మానవాళి ఆరోగ్యానికి సంబంధించిన ఎంతో ముఖ్యమైన ఈ విషయంలో భారత్ తీసుకున్న చొరవను, తీర్మానంపై చర్చలకు నాయకత్వం వహించడాన్ని స్వాగతిస్తూ భారత్‌ను ఐరాస సభ్య దేశాలు ఎంతగానో ప్రశంసించడం భారతీయులందరికీ గర్వకారణం.



చిరుధాన్యాల(మిల్లెట్స్)కు ఇప్పుడు అంతర్జాతీయ ఖ్యాతి వచ్చింది. ప్రధాని మోడీ చొరవతో తాజాగా మనదేశం ఐక్యరాజ్యసమితిలో ప్రవేశపెట్టిన 'మిల్లెట్స్ తీర్మానం' ప్రపంచవ్యాప్తంగా అందరి అభినందనలు అందుకుంటోంది. బంగ్లాదేశ్, కెన్యా, నేపాల్, నైజీరియా, సెనెగల్, రష్యా దేశాలతో కలిపి భారత్ ఇటీవల ఆ తీర్మానాన్ని ప్రవేశపెట్టగా 70 దేశాలు మద్దతు తెలపడం, 193 దేశాలు ఏకగ్రీవంగా ఆమోదించడం... 2023వ సంవత్సరాన్ని 'చిరుధాన్యాల సంవత్సరం'గా ఐక్యరాజ్య సమితి ప్రకటించడం ఎంతో విశేషం.

చిరుధాన్యాలంటే ప్రకృతి మనకు ప్రసాదించిన వరాలు. వాటిపై శ్రద్ధపెట్టి వాటిని సద్వినియోగం చేసుకోగలిగితే మనకే కాదు, సకల మానవాళికంతటికీ ఆరోగ్యపరంగా అన్ని విధాలా మేలు చేకూరుతుంది. కనుకనే ప్రధాని మోడీ సారధ్యంలోని భారత ప్రభుత్వం ఎంతో లోతుగా ఆలోచించి ప్రపంచ ప్రజలందరి ఆరోగ్యానికి బాసటగా ఉండేలా ఈ తీర్మానాన్ని రూపొందించింది. 'చిరుధాన్యాలుండగా..దిగులెందుకు దండగ' అన్నట్లుగా వాటి విశిష్టతను అందరూ తెలుసుకోవాలని భారత్ కోరుతోంది. చిరుధాన్యాలను పండించే రైతాంగానికి కూడా కొత్త వెలుగులు ప్రసరింపజేయాలనే ఉద్దేశం కూడా ఇందులో మిళితమై ఉంది. తృణధాన్యాలే కదా అని తృణప్రాయంగా తీసివేయకుండా మంచి ఆరోగ్యానికి అవి దివ్యౌషధాలుగా గుర్తించి, వాటిని పరిరక్షించుకోవాలనే జిజ్ఞాసను కూడా అన్ని దేశాల వారిలో కలిగించింది. అందులోనూ మాయదారి కరోనా మహమ్మారి ప్రపంచాన్ని ఇంకా భయపెడుతూ నిత్యం ఎంతోమందిని కబళిస్తూనే ఉన్న వేళ..అలాంటి వ్యాధుల బాధలను ధీటుగా ఎదుర్కొనేందుకు వ్యాధినిరోధకశక్తి ఎంతో అవసరమని, అందుకు ఆరోగ్యకరమైన పోషకాహారం తీసుకోవాలనే మన ప్రాచీన భారతీయ సంస్కృతి సంప్రదాయాలను, మంచి ఆహారపు అలవాట్లను ప్రపంచానికంతా చాటిచెప్తూ మనదేశం ప్రపంచానికే మార్గదర్శకమవుతోంది. ప్రపంచ ప్రజలంతా ఆరోగ్యవంతంగా ఉండాలని ఆకాంక్షించే తత్వం, విశ్వశ్రేయస్సును మనసారా కాంక్షించే మనస్తత్వంతో భారత్..నేడు ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తుండడం అందరికీ గర్వకారణం.

---

గ్రంథ సమీక్ష


# ఆకట్టుకునే దీర్ఘకవిత 'నేను ముంబైకర్‌ని'

సంగెవేని రవీంద్ర రాసిన 'నేను ముంబైకర్‌ని...!' దీర్ఘ కవితా గ్రంథం తెలుగు పాఠకుల కోసం ముస్తాబై వచ్చింది. ఈ గ్రంథాన్ని చదివాక మనకు ఒక విషయం బోధపడుతుంది. ఇది కేవలం కవిత్వానికి సంబంధించిన పుస్తకం కాదని, ఇందులో అనేక చారిత్రకమైన విషయాలు దాగివున్నాయని. అంతేకాక ఒక వలసపక్షి యొక్క మనోగతం కూడా ఇందులో హృద్యంగా ఆవిష్కరణం అయిందని.

'వలస' అనేది మానవ జీవిత పరిణామ చక్రంలో ఒక సహజమైన ప్రక్రియ. ఇది తెలియని వారు, హృదయ వైశాల్యం లేని వారు 'వలసల' పట్ల ద్వేషం కనబరుస్తారు. ఈ నేపథ్యంలో వలస దారుడైన ఒక మామూలు మనిషి పడే ఆవేదన, ఆందోళనలను కవి సంగెనేని అనితరసాధ్యంగా దీర్ఘకవిత రచించి, ముద్రించి మనకందించారు.

'నేను ముంబైకర్‌ని...!' అంటే ఆనాటి తెలుగు వాడికి ప్రతినిధి. మొట్టమొదటిసారిగా ముంబై నేలమీద పాదంమోపిన తెలుగువాడి ప్రస్థానగాథే ఇది. వలసలతో మొదలై, వివిధ రంగాల్లో తెలుగోళ్ళు ఎగరేసిన చారిత్రక విజయాలు ఈ గ్రంథంలో ఉన్నాయి. దేశంలో ఎన్నో రాష్ట్రాలకు తెలుగువాళ్ళు వలసవెళ్లారు. కానీ వలస వెళ్లిన ప్రాంతాన్ని కన్నతల్లిగా ప్రేమించి, అభిమానించి అభివృద్ధికి దోహదపడిన చరిత్ర ఒక్క మరాఠా తెలుగోడికే సొంతం అంటారు కవి సంగెనేని. ముంబైలో తెలుగు వాళ్లు ఎక్కడచూసినా కన్పిస్తారు. ముంబై అణువణువు తెలుగోడి చెమట చుక్కల పరిమళంతో వుంది.

అయితే ముంబైలో దాదాపు అన్ని రాష్ట్రాల ప్రజలకోసం భవనాలున్నాయి. కానీ తెలుగు భవనం లేదు. తెలుగు పాఠశాలలు మూతపడుతున్నాయి. చిత్రం ఏమంటే, దాదాపు కోటిమంది తెలుగు మూలాలు కలిగిన జనాభా ఉన్న మహారాష్ట్రలో, ముంబయి విశ్వవిద్యాలయంలో ఇంతవరకు తెలుగు పీఠం కూడా లేదు. ఆనాడు మిల్లులలో పనిచేయడానికి వెళ్లినవారు ఈనాడు అవి మూతపడడంతో ఎంతో ఇబ్బంది పడుతున్నారు. వారి దుస్థితి పట్టించుకునే వారు కరువయ్యారు. కవి బాధ అంతా అదే! ముంబయి నగర నిర్మాణంలో తెలుగోడి పాత్ర అగణ్యం! నేడు అక్కడి తెలుగువారికి మాత్రం గుర్తింపు శూన్యం.




రచన : సంగెవేని రవీంద్ర
వెల : రూ.100 /- పేజీలు : 56
ప్రతులకు:
సి.వి.కాంపౌండ్ 7/4, హనుమాన్‌లేన్,
లోయర్ పారెల్, ముంబై - 400 013.
సెల్ : 099871 45310

శాతవాహనుల కాలంనుంచి, మహారాష్ట్రతో తెలుగువారికి విడదీయలేనంత అనుబంధం వుంది. మరాఠీలో ద్రావిడ భాషాపదాలు కన్పిస్తాయి. నాసిక్ దగ్గర దొరికిన ఒక శాసనంలో తెలుగు పదాలు కన్పించాయి. షిర్డీలో కన్పించే భక్తులు అత్యధికులు తెలుగువారే! ఒకపక్క ప్రవాసాంధ్రుడుగా ఆవేదన చెందుతూనే, మరొకపక్క ముంబైని సంగినేని అమితంగా ప్రేమించడం ఈ దీర్ఘ కవితలో చూస్తాం.

'నేను ఇక్కడ చరిత్ర నిర్మించాను.../ కానీ నిర్మించిన చరిత్రను అక్షరాల్లో నిక్షిప్తం చేసుకొని/ అమాయక తెలుగోడిగా మిగిలాను చివరిగా...!/ అన్న వాక్యాల్లో ఆవేదన కన్పిస్తుంది. "ముంబయి అంటే నాకు / మెతుకు మాత్రమే కాదు.../ ఇది నాకు బతుకు పాఠాలబడి.../ అమ్మను మరిపించిన/చిన్నమ్మ ఒడి" – పుట్టిన తెలంగాణాను అమ్మగా భావిస్తూ బతుకునిచ్చిన ముంబయిని చిన్నమ్మ అనడం, కవిలోని సంస్కారాన్ని, హృదయ వైశాల్యాన్ని తెలుపుతుంది. ముంబయి అంటే కవికి వల్లమాలిన అభిమానం, ఆప్యాయత, కృతజ్ఞత... అన్ని భావాల కలబోతానూ. అందుకే డా.ఎన్.గోపి ఈ దీర్ఘకవిత గురించి ఇలా అన్నారు. 'ఈ దీర్ఘకవిత అంటే చిన్న కవితకు పొడిగింపు కాదు. పెద్ద కాన్వాసు మీద చిత్రించిన బృహత్ చిత్రం. దీనిలో వలస కార్మికుల వేదనతో పాటు, వారు ముంబై నిర్మాణంలో అందించిన శ్రమదానం కూడా వుంది. కష్టాలు, కడగండ్లే కాదు, చేతికందిన పూల చెండ్లు కూడా ఉన్నాయి'. చరిత్రకు సంబంధించిన అనేక విషయాలు గుదిగుచ్చిన సంగెనేని మంచి కవేకాదు చరిత్రకారుడు కూడా! కవిగా, సంపాదకుడుగా, రచయితగా ఖ్యాతి గాంచి ఇప్పటికి 17 గ్రంథాలు రచించి, ఎన్నో అవార్డులు పొందిన సంగెవేని ముమ్ముందు మరెన్నో గ్రంథాలు వెలువరించాలని కోరుకుంటూ..



సమీక్ష : డా. గంగిశెట్టి శివకుమార్
ఫోన్ : 9441895343

---

## ఆదాల దంపతుల ఔదార్యం

# ఎంతో ఆదర్శప్రాయం

నెల్లూరు లోక్‌సభ సభ్యులు ఆదాల ప్రభాకరరెడ్డి, వారి సతీమణి శ్రీమతి ప్రభాకరరెడ్డిల ఔదార్యం దాతలందరికీ ఆదర్శప్రాయం. తేది. 9.3.2021 వారి వివాహ వార్షికోత్సవం సందర్భంగా నెల్లూరు విశ్వభారతి అంధుల పాఠశాలకు లక్ష రూపాయలు విరాళంగా అందచేసి తమ ఔన్నత్యాన్ని చాటుకున్నారు. వారి జన్మదినము, వారి శ్రీమతి జన్మదినము, వారి వివాహ మహోత్సవము... ఇలా వారి కుటుంబ సభ్యులకు సంబంధించి ఏమైనా పర్వదినాలు వచ్చిన రోజు అనాధాశ్రమాలకు, పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు, నిరాధారులకు చేయూతనివ్వడం ఎంతైనా ప్రశంసనీయం.




ఇటీవల కరోనా సందర్భంలో గత మార్చి నుంచి లాక్‌డౌన్ నిబంధనలను సడలించే వరకు లక్షలాది రూపాయలు స్వీయనిధులతో పేదలకు చేయూతనిచ్చుట ద్వారా దేశంలోనే ప్రథమ సేవాతత్పరునిగా ఢిల్లీకి చెందిన సంస్థచే అవార్డు అందుకున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి మన సింహపురి సీమకే కాక, రాష్ట్రానికే గర్వకారణం. వారికి ప్రత్యేకమైన అభినందనలు తెలియచేస్తున్నాము. ఆదాల రాష్ట్రంలోని వై.సి.పి. ఎంపీలందరికీ ఆదర్శం.

డా॥ యస్.బాబూరావు, కావలి.

# ఈ సృష్టి ఉన్నంతవరకు..

# బాలు పాట-మాట నిలిచే ఉంటాయి

**ఈ** నేలపై పుట్టిన ఒక రాగాల కోయిల.. తియ్యతీయని పాటలెన్నో అలవోకగా పాడుతూ..తన గంధర్వగానంతో లోకాన్నే మైమరపించింది. మధురాతి మధురమైన ఆ స్వరమే ఒక వరమై..సరిగమ పదనిసల సుమధురిమలన్నిటినీ పుక్కిటపట్టి.. సరిగంగ ప్రవాహంలా జాలువారే తన మధుర గాన లాహిరితో సమస్త సంగీత ప్రపంచాన్నే ఉర్రూతలూగించింది. సుస్వర రాగరంజితమైన ఆ మధురగానమే.. అద్భుతమై.. అపూర్వమై.. అమోఘమై.. సంగీత రసఝరీప్రవాహమై..అతిలోక సుందరమై అందరినీ మంత్రముగ్ధుల్ని చేసింది. ఆ గాన కోయిలే.. మన బాలు. నెల్లూరు గానాలపట్టి... తెలుగుతల్లి కన్నబిడ్డ.. కళామతల్లి ముద్దుబిడ్డ.. సకల భారతావనికే గర్వ కారణమైన.. మన బాలు. ఆ చిరస్మరణీయమైన గానమాధుర్యాన్ని,.. ఆ సుప్రశాంత మనోహర రూపాన్ని, మనసుల్ని పరవశింపజేసే ఆయన మాటల్ని.. పాటల్ని తలచుకుంటూ బాలు అభిమాన జనసందోహంతో క్రిక్కిరిసిపోయిన నెల్లూరు పురమందిరం.. బాలు జ్ఞాపకాలను ఒక్కసారిగా తలచుకుని పులకించిపోయింది. తన గారాల రాగాల బిడ్డ గొప్పదనం గురించి అందరూ మెచ్చుకుంటుంటే.. కన్నతల్లి లాంటి నెల్లూరు నేలతల్లి ఆనందబాష్పాలతో తడిసి ముద్దయిపోయింది.



- జ్ఞాన గంధర్వుడికి నెల్లూరులో అపూర్వ నివాళి
- అద్వితీయంగా స్వర నీరాజనాలర్పించిన 'కళాంజలి'
- పులకించిపోయిన పురమందిరం
- నాన్నగారిని తలచుకుని కంటతడిపెట్టిన తనయుడు చరణ్
- బాలు స్మారకం ఏర్పాటుకు అండగా నిలుస్తానన్న విపిఆర్

గాన గంధర్వుడే కాదు.. జ్ఞాన గంధర్వుడు!.. భారతీయ సినిమా గాయకుడు శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం (ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం) స్మృత్యంకంగా నెల్లూరులోని 'కళాంజలి' సాంస్కృతిక సంస్థ వ్యవస్థాపకుడు అనంత్ సారథ్యంలో ఈనెల 7వ తేది రాత్రి నెల్లూరు టౌన్‌హాలులో 'పాడుతా తీయగా' గాయనీ గాయకులచే రసరాగ రంజితంగా.. రాగ రసరమ్యభరితంగా.. బాలుకు 'స్వర నీరాజనాలు' అర్పించారు. ఈ కార్యక్రమం ద్వారా బాలు పాడిన పాటలను మరోసారి మధురంగా ఆలపించి బాలును కళ్ళముందు నిలుపుతూ శ్రోతల్ని తన్మయుల్ని చేశారు.

ఈ సందర్భంగా తొలుత అందరూ రెండు నిమిషాల పాటు నిల్చుని మౌనం పాటించి బాలు స్మృతికి శ్రద్ధతో అంజలి ఘటించారు.

ఈ సుస్వర నీరాజనంలో పాలుపంచుకునేందుకు బాలు తనయుడు ఎస్పీ చరణ్ విశిష్ట అతిథిగా వచ్చి 'నాన్నగారు లేకుండా నేనిక్కడికి రావడాన్ని నేనెప్పుడూ ఊహించలేదు' అంటూ కంటతడి పెట్టినప్పుడు బాలు అభిమానులందరి హృదయాలు ద్రవించిపోయాయి.

రాజ్యసభ సభ్యులు, నిరాడంబరులు.. నిగర్వి, బాలుపై ఎనలేని ప్రేమాభిమానాలున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి చెప్పిన మాటలు జీవితకాలం పాటు అవి అందరికీ గుర్తుండిపోతాయి.

ఈ అపురూపమైన కార్యక్రమానికి బాలుకు అత్యంత ఆత్మీయుడు, 'లాయర్' వారపత్రిక అధినేత తుంగా శివప్రభాత్‌రెడ్డి(పభు) అధ్యక్షత వహించి మాట్లాడుతూ.. 'ఈ సృష్టి ఉన్నంత కాలం సంగీత ప్రపంచంలో బాలు జీవించే ఉంటారు' అంటూ ఉద్వేగంతో చెప్పిన మాటలు, ఆ మహోన్నత గాన శిఖరానికి శిరస్సు వంచి నమస్కరించాలన్న భావోద్వేగం.. అందరి మనసుల్లో ఇట్టే నాటుకుపోయాయి. ఆయన అన్నట్లుగా.. నిజంగానే బాలు ఆత్మ కూడా తప్పకుండా ఇక్కడే ఉండి.. ఇలా 'తన మనుషుల'నుకునే అందరి మనసుల్లోని ఆత్మీయతానుబంధానికి.. స్నేహాభిమానానికి ఉప్పొంగిపోయి ఉంటుంది.

10లో



## నాన్నగారు లేకుండా వస్తాననుకోలేదు

**- చరణ్**

నాన్నగారి సంస్మరణ కార్యక్రమంలో పాల్గొనడం నాకెంతో బాధగా ఉంది. ఇలాంటి రోజు వస్తుందని నేనెప్పుడూ అనుకోలేదు. నాన్నగారు లేకుండా నెల్లూరుకు రావడం ఏదోగా ఉంది. వారు లేకపోవడం మాకు చాలా పెద్ద దెబ్బ. నాన్నగారికి నెల్లూరులో ఎందరో అభిమానులు, ఆత్మీయులు, మిత్రులు ఉన్నారు. వారి పేరుపై ఇక్కడ నేషనల్ అవార్డు కూడా ఏర్పాటు చేశారు. నాన్నగారు నెల్లూరులో ఎన్నో కార్యక్రమాలు చేశారు. అందుకు అందరూ ఎంతగానో సహకరించారు. వారందరికీ కృతజ్ఞతలు. నాన్నగారు లేకుండా మొదటిసారిగా వేదిక ఎక్కాను. నాన్నగారు ఎప్పుడూ నన్ను 'తెలుగు నేర్చుకోరా..తెలుగు మాట్లాడరా' అంటుండేవారు. అలా ఎందుకనేవారో నాకు ఇప్పుడు బాగా అర్థమవుతోంది. నెల్లూరు మా నాన్నగారి ఊరు. ఇది మా నెల్లూరు. నెల్లూరంటే మాకెంతో అభిమానం. నేను ఇకనుంచీ నెల్లూరుకు వస్తూనే ఉంటాను. ఇంత గొప్పగా మా నాన్నగారి మీద, మా కుటుంబం మీద ఎంతోకాలంగా మీరు చూపుతున్న ప్రేమాభిమానాలకు శిరసు వంచి నమస్కరిస్తున్నాను.

## బాలు గారు నెల్లూరీయుడు కావడం గర్వకారణం



**- వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి**

ప్రపంచమే గర్వించే స్థాయిలో పదహారు భాషల్లో నలభైవేల పాటలు పాడి వరల్డ్ రికార్డు సృష్టించిన బాలు మన నెల్లూరీయుడు కావడం మనకు గర్వకారణం. అంతేకాదు, అయిదు విశ్వవిద్యాలయాల నుంచి డాక్టరేట్లు పొందడం, పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషణ్ వంటి విశిష్టమైన అవార్డులందుకోవడం బాలు గారికే చెల్లింది. ప్రపంచంలోనే ఒక గొప్ప వ్యక్తి బాలు. 2018లో అమెరికాలో 'నాటా' వాళ్ళు నాకు అవార్డు ఇచ్చినప్పుడు, నా గురించి ఒక పాట పాడి, రికార్డుచేసి నేను అమెరికాకు వెళ్ళేలోగానే వేదికపై ఆ పాటను ప్రదర్శించారు. బాలు గారు నాపట్ల వ్యక్తిగతంగా ఎంతో శ్రద్ధ తీసుకుని ఆ పాట అద్భుతంగా పాడారు. అన్నింటికీ మించి ఆయనో మానవీయమైన వ్యక్తి. ఎందరికో బతుకుతెరువు కల్పించేందుకు ఎంతో పట్టుదలతో బాలు గారు కృషి చేశారు. బాలు గారికి నెల్లూరంటే ఎంతో అభిమానం. ఆయన్ను మనం ఎప్పటికీ మరచిపోకూడదు. ఆయన స్మారకంగా ప్రభుత్వం తరఫున నెల్లూరులో ఒక మెయిన్‌రోడ్డుకి బాలు పేరు పెట్టాలి. 'బాలు గారు నెల్లూరులోనే ఉండారు' అన్నట్లుగా ఇంకా ఏమైనా చెయ్యాలన్నా నేను తప్పకుండా చేస్తాను. బాలు గారి కుమారుడు చరణ్ కూడా తరచుగా ఇక్కడికి వస్తుండాలి. చరణ్ రూపంలో మనం బాలు గారిని చూసుకుందాం.

## బాలు గారి కాంశ్య విగ్రహాన్ని ఏర్పాటుచేయాలి



**- హజరత్‌బాబు**

గానగంధర్వుడు, విఖ్యాత గాయకుడు, మన నెల్లూరీయుడైన బాలు గారి ప్రతిభా పాటవాలు అపారం. తన మధురగానంతో ప్రపంచఖ్యాతి పొందిన ప్రజ్ఞావంతులాయన. బాలు గారి స్మారకంగా నెల్లూరులోని ప్రభుత్వ సంగీత పాఠశాలకు రాష్ట్ర ప్రభుత్వం బాలు గారి పేరు పెట్టింది. అక్కడ బాలు గారి కాంశ్య విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేస్తే మరింత బావుంటుంది. బాలు తనయుడు చరణ్ తండ్రికి తగ్గ తనయుడు. ఎంతో సహృదయుడు. బాలు కుటుంబమంతా మాకెంతో ఆత్మీయులు కావడం మా పూర్వజన్మ సుకృతం. కళాంజలి సంస్థ అనంత్ సారథ్యంలో గత 30 ఏళ్ళుగా కళారంగానికి చేస్తున్న సేవలు అనంతం. ఆ సంస్థకు నేను గౌరవాధ్యక్షుణ్ణి కూడా. కళారంగంలో ఎంతో మంచి కార్యక్రమాలు ఏర్పాటు చేస్తూ ఎంతో ప్రజాభిమానం పొందుతున్న కళాంజలి సంస్థకు ఒక కమిటీని, ఒక నిధిని కూడా ఏర్పాటు చేసి, ప్రతి మూడు నెలలకు ఒక మంచి కార్యక్రమం ఏర్పాటుచేసేలా దాతలు సహకరిస్తే బావుంటుందని నా మనవి.

## స్నేహానికి నిలువెత్తు రూపం.. బాలు గారు



**-శివప్రభాత్‌రెడ్డి(ప్రభు)**

స్నేహానికి నిలువెత్తు రూపం మన బాలు గారు. స్నేహితులపై ఆయనకున్న ప్రేమకు, మమకారానికి హద్దులు లేవు. అరవై అయిదేళ్ళుగా ఆయన వారికి నీడగా ఉంటే, వాళ్ళు ఆయనకు తోడుగా ఉండేవాళ్ళు. నిష్కల్మషమైన స్నేహానికి ప్రతిరూపం ఆయన. ఒకసారి స్నేహం చేస్తే, చిన్నా పెద్దా అనే వయసు తారతమ్యం కూడా చూపని ఆప్తమిత్రుడిగా హృదయానికి హత్తుకుంటారు. ఆయనకు నేను మిత్రుడినైనందుకు గర్వపడుతున్నా. పాటలంటేనే కాదు, అమ్మానాన్నలన్నా బాలు గారికి ప్రాణం. తనకంటే తమ నాన్నకు ఎక్కువగా పేరు రావాలని తపనపడేవారు. ఎంత బిజీగా ఉన్నా నెలకొక్కసారైనా నెల్లూరుకు వచ్చి ఆ రోజంతా అమ్మతోనే ఉండేవారు. తన చెల్లెళ్ళన్నా, తన కుటుంబసభ్యులైనా అందరినీ ప్రాణం కన్నా మిన్నగా చూసుకునేవారు. పేద కళాకారుల కుటుంబాల వారెందరికో ఆయన ఆప్తులు.. ఆత్మబంధువు కూడా. ఎంతోమందికి గుప్తదానాలు చేసేవారు. తను చేసిన సహాయాన్ని ఎవరికీ చెప్పుకునేవారు కాదు... అంతటి సహృదయుడు. స్వచ్ఛభారత్ బ్రాండ్ అంబాసిడర్‌గా 'స్వచ్ఛ నెల్లూరు' కోసం కూడా ఆయన తపించేవారు. తనతండ్రి గారైన శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తి విగ్రహావిష్కరణ సందర్భంగా నెల్లూరులో 2015 అక్టోబర్ 3వ తేదీన వేలాదిమంది నెల్లూరు ప్రజల సమక్షంలో అద్వితీయంగా స్వచ్ఛసంగీత కార్యక్రమాన్ని నిర్వహించి చరిత్ర సృష్టించారు. ఆయనకి జరిగిన సత్కారాలు, ఆయన చేసిన సత్కార్యాలు లెక్కలేనన్ని. ఆయన జీవితం అందరికీ ఆదర్శం. ఒక్కమాటలో చెప్పాలంటే ఈ సృష్టి ఉన్నంత కాలం ఈ సంగీత ప్రపంచంలో బాలు గారు జీవించే ఉంటారు. అలాంటి మహానుభావుడి స్మారకంగా నెల్లూరులోని అన్నమయ్య సర్కిల్ వద్ద పార్కులో బాలు గారి విగ్రహం ఏర్పాటు చేయడం సముచితంగా ఉంటుంది. అదేవిధంగా నెల్లూరులో ఏర్పాటు చేయనున్న మినీ రవీంద్రభారతికి బాలు గారి పేరు పెడితే బావుంటుంది.

## సంగీతరంగంలో ఆయనో మేరుపర్వత శిఖరం



**- ఎల్.వి.కృష్ణారెడ్డి**

బాలు గారు మహోన్నతమైన వ్యక్తి. ఆయన పాటలు మధురాతి మధురం. సంగీతరంగంలో ఆయనో మేరుపర్వత శిఖరం. సినీసంగీత ప్రపంచంలో ఎవరికీ అందనంత ఎత్తుకు ఎదిగారు. అయినా, ఎంత ఎదిగినా ఒదిగి ఉండే స్వభావం ఆయన సొంతం. 'పాడుతా తీయగా' కార్యక్రమాల్లో వర్ధమాన గాయనీ గాయకులకు మెళకువలు చెప్పడంలో ఆయనకాయనే సాటి. వారిని తమ సొంతబిడ్డలకన్నా ఎక్కువగా భావిస్తూ వారికి బాగా అర్థమయ్యేరీతిలో చెప్పడం ఎంతో గొప్పవిషయం. నెల్లూరులోని విక్రమసింహపురి విశ్వవిద్యాలయంలో బాలు గారి స్మారకంగా ఒక స్టేడియం నిర్మిస్తే బాగుంటుందని నా అభిప్రాయం.

# నెల్లూరు కబుర్లు

## టీకా వేసుకోవాలి..

# కరోనాను నివారించాలి

**జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు**



ప్రతి ఒక్కరూ కరోనా టీకా వేసుకోవాలని, టీకా వేసుకోవడం ద్వారానే కరోనాను ఎదుర్కోగలమని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు చెప్పారు. ఈనెల 7న ఆయన బివి నగర్‌లోని క్రాంతినగర్ పట్టణ ఆరోగ్యకేంద్రంలో రెండో డోసు టీకా వేసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అందరూ స్వచ్ఛంధంగా ముందుకువచ్చి వ్యాక్సిన్ వేయించుకుని జిల్లాను కోవిడ్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు తమవంతు సహాయ సహకారాలందించాలని పిలుపునిచ్చారు. ఇప్పుడు మూడోవిడతగా 60 ఏళ్ళకు పైబడిన వారికి టీకా వేస్తున్నారని, 40 ఏళ్ళు పైబడిన వారికి బిసి, షుగర్ వంటి దీర్ఘకాలిక రుగ్మతలు ఉన్నవారికి వ్యాక్సిన్ వేస్తున్నారని పేర్కొన్నారు. పూర్తిస్థాయిలో కరోనా కేసులను నివారించాలంటే ప్రతిఒక్కరూ కరోనా వ్యాక్సిన్ వేయించుకోవాలన్నారు. జిల్లాలో 58వేల మందికి గాను 50వేల మందికి కోవిడ్ వ్యాక్సిన్ వేశారని, 94 ఏళ్ళ వృద్ధులు కూడా టీకా వేసుకుంటున్నారని చెప్పారు. కోవిడ్ వ్యాక్సిన్‌పై ప్రజలు అపోహలు వీడాలని, లేనిపోని పుకార్లు నమ్మవద్దని కోరారు. డిఎంఅండ్‌హెచ్‌ఓ రాజ్యలక్ష్మి, డాక్టర్ అమరేంద్ర నాథ్‌రెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## అంధుల పాఠశాలకు...

# ఆదాల దంపతుల సాయం

- పెళ్ళిరోజు కానుకగా లక్ష రూపాయల విరాళం



నెల్లూరు ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి దంపతులు తమ పెళ్ళిరోజు సందర్భంగా నెల్లూరులోని విశ్వభారతి అంధుల పాఠశాలకు లక్ష రూపాయల విరాళం అందించి తమ మానవతా హృదయాన్ని చాటుకున్నారు. ఆ నగదును ఈనెల 9వ తేదిన విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి ద్వారా అంధుల పాఠశాల నిర్వాహకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ స్వర్ణ వెంకయ్య, కోటేశ్వరరెడ్డి, పాముల హరి, ఇక్బాల్, అవినాష్, నరసింహారావు, శ్రీనివాసరెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్వాహకులు ఎంపి ఆదాల సతీమణి వింద్యావళితో ఫోన్‌లో మాట్లాడుతూ తమ కృతజ్ఞతలు చెప్పారు.

## టీకా వేసుకున్న రత్నం మాష్టారు




జిల్లాలో ప్రైవేట్ విద్యాసంస్థల ఆది గురువు, రత్నం విద్యాసంస్థల వ్యవస్థాపకులు కె.వి.రత్నం గారు మార్చి 5వ తేదీ శుక్రవారం ఉదయం కోవిడ్ టీకా వేసుకున్నారు. ప్రతిఒక్కరూ సంకోచించకుండా టీకా వేసుకుని కోవిడ్‌ని నియంత్రించి, నివారించడానికి దోహదపడాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

# సమిష్టి కృషితోనే అభివృద్ధి సాధ్యం

**ఆర్టీసి ఎం.డి ఆర్‌పి ఠాకూర్**



ఆర్టీసి అధికారులు, సిబ్బంది అందరం కలసి పని చేస్తేనే సంస్థ అభివృద్ధి సాధ్యమవుతుందని ఆర్టీసి మేనేజింగ్ డైరెక్టర్ ఆర్‌పి ఠాకూర్ ఉద్యోగులు, సిబ్బందికి పిలుపునిచ్చారు. ఈనెల 7న ఆయన నెల్లూరు పర్యటనకు వచ్చారు. పలు ఆర్టీసి డిపోలను పరిశీలించారు. నెల్లూరు 2వ డిపోలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సమిష్టిగా కృషిచేసి ఆర్టీసీని అభివృద్ధి బాటలో నడిపిద్దామని, ప్రయాణీకులకు ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు. ఉద్యోగులు, సిబ్బంది సమస్యలు తీర్చేందుకు తాను ఎల్లవేళలా ముందుంటానని హామీ ఇచ్చారు. ఆ తర్వాత ఉత్తమంగా నిలిచిన నెల్లూరు-1, గూడూరు, సూళ్ళూరుపేట డిపో మేనేజర్లను ఆయన అభినందించారు. రెండవ డిపో ఆవరణంలో మొక్కను నాటారు. ఆర్టీసి జోనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గోపినాథ్‌రెడ్డి, ఆర్ఎం వెంకటశేషయ్య, సిటిఎం రవికాంత్, డెప్యూటి సిఎంఇ ఇబ్రహీం, 1,2 డిపోల మేనేజర్లు ఆర్.ముక్తేశ్వరరావు, శివకేశ్ యాదవ్ పాల్గొన్నారు.

# మహిళా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

**డిఆర్‌డిఏ పి.డి సాంబశివరావు**

మహిళా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తోందని డిఆర్‌డిఏ పి.డి సాంబశివారెడ్డి అన్నారు. ఈనెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నెల్లూరులోని కలెక్టరేట్‌లో ఉన్న వెలుగు కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమాజాన్ని ముందుకు నడిపించేది స్త్రీలేనని, అన్నిరంగాల్లో మహిళలు ఎంతో ప్రతిభతో రాణిస్తున్నారని చెప్పారు. మహిళల ఆర్థికాభ్యున్నతి కోసం ప్రభుత్వం అనేక పథకాలను అందిస్తోందని, ముఖ్యంగా సున్నా వడ్డీ పథకం, జగనన్న తోడు, వైఎస్సార్ చేయూత వంటి పథకాలు మహిళలకు ఎంతగానో ఉపకరిస్తున్నాయని అన్నారు. మహిళలు ప్రభుత్వం అందిస్తున్న చేయూతతో స్వావలంబన సాధించాలని కోరారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవలందిస్తున్న జిల్లా పంచాయతి అధికారి ఎం. ధనలక్ష్మిని ఘనంగా సత్కరించారు.

## మహిళల భద్రత కోసమే..

# 'దిశ యాప్'

**- జిల్లా ఎస్పీ భాస్కర్‌భూషణ్**




జిల్లాలో మహిళలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా జిల్లా పోలీసుశాఖ ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటుందని, జిల్లా మహిళల భద్రతే లక్ష్యంగా కృషి చేస్తున్నామని, మహిళల రక్షణ కోసం ప్రభుత్వం రూపొందించిన 'దిశ' యాప్‌ను మహిళలు డౌన్ లోడ్ చేసుకోవాలని జిల్లా ఎస్పీ భాస్కర్‌భూషణ్ సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నెల్లూరులో ఈనెల 7న పోలీసుశాఖ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిర్వహించిన ర్యాలీని జిల్లా ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ఎంతో ధీటుగా రాణిస్తున్నారన్నారు. మహిళల భద్రత అందరి బాధ్యతగా ఉండాలన్నారు. రాష్ట్రప్రభుత్వం మహిళల భద్రత, అభ్యున్నతి కోసం అనేక చర్యలు తీసుకుంటున్నదని, ముఖ్యంగా మహిళల భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం తొలిసారిగా 'దిశ' చట్టాన్ని రూపొందించి అమలు చేస్తూ దేశానికే గర్వకారణంగా నిలిచిందన్నారు. 'దిశ యాప్' వల్ల కలిగే ప్రయోజనాల పట్ల మహిళా లోకానికి అవగాహన కలిగించేందుకు జిల్లావ్యాప్తంగా అనేక కార్యక్రమాలు చేపట్టనున్నామన్నారు. ర్యాలీలో జిల్లా అదనపు ఎస్పీలు వెంకటరత్నం, వీరభద్రుడు, సెబ్ జాయింట్ డైరెక్టర్ శ్రీలక్ష్మి, డిఎస్పీలు జె.శ్రీనివాసులురెడ్డి, నాగరాజు, మల్లికార్జునరావు పాల్గొన్నారు.

## టీచర్ల పోస్టులను

# భర్తీచేయాలి

రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీచేయాలని ఏపిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు కోరారు. నెల్లూరు నగరంలోని ఏపిటిఎఫ్ కార్యాలయంలో ఈనెల 7న జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అనేక పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగానే ఉన్నాయని, డిఎస్సీ ద్వారా వాటిని భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

## వాసవి వనిత క్లబ్

# సభ్యులకు సన్మానం

నెల్లూరులోని వాసవి వనిత క్లబ్ సభ్యుల ప్రమాణస్వీకారోత్సవం ఈనెల 7న స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో జరిగింది. ఈ సందర్భంగా కొత్తగా ఎన్నికైన నూతన కమిటీ ప్రతినిధులను సన్మానించారు. కొత్త కమిటీకి అధ్యక్షురాలిగా అమరా వెంకటసుప్రజ, ఉపాధ్యక్షురాలిగా నున్నా విజయలక్ష్మి, కార్యదర్శిగా విజయలక్ష్మి, ఉప కార్యదర్శులుగా దుగ్గిశెట్టి శ్వేత, సుశీల, కోశాధికారి తన్నీరు భారతి, అదనపు కోశాధికారులు వనజారాణి, భవాని, సుప్రజ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ నాయకులు సిహెచ్ వెంకటస్వామి, పిండి వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ సరుకులను

# సకాలంలో అందజేస్తాం

**- కొత్త డిఎం పి.పద్మ**



పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్‌గా కొత్తగా నియమితులైన పి.పద్మ ఈనెల 8న నెల్లూరులో ఉద్యోగబాధ్యతలు చేపట్టారు. ఇప్పటిదాకా ఆమె హైదరాబాద్, విజయవాడల్లోని ఆ సంస్థ హెడ్‌ఆఫీసుల్లో పనిచేసి విజయవాడ నుంచి వైఎస్సార్ జిల్లా డిఎంగా బదిలీ అయ్యారు. అక్కడ నుంచి నెల్లూరులో డిఎంగా నియమితులయ్యారు. నెల్లూరులోని వేదాయపాళెంలోని కార్యాలయంలో ఆమె బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో రేషన్ సరుకులను సకాలంలో పంపిణీ చేసేందుకు కృషిచేస్తామన్నారు. ధాన్యం సేకరణలో రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు.

# సెలవులో డిఇఓ

జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ ఇటీవల అనారోగ్య కారణాలతో సెలవుపై వెళ్ళడంతో, ఇన్‌చార్జి డిఇఓగా... ఏ.డిగా పని చేస్తున్న రఘురామయ్యకు బాధ్యతలు అప్పగించారు.

# అన్నదానం

మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 8న నెల్లూరులోని తమ్మినేని కృష్ణయ్య మెమోరియల్ ట్రస్ట్, గీతామయి ఫౌండేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ వద్ద జరిగిన కార్యక్రమంలో నిర్వాహకులు తమ్మినేని పాండు, మోపూరు భాస్కరనాయుడు, సుదీఫ్, సువర్ణ, అపర్ణ పాల్గొన్నారు.

## విద్యుత్ మీటర్ల రీడింగ్ విధానాన్ని

# పరిశీలించిన ఎస్ఇ



నెల్లూరులో పలు ప్రాంతాల్లో విద్యుత్ మీటర్ల రీడింగ్ విధానాన్ని ఈనెల 7న ఏపిఎస్‌పిడిసిఎల్ ఎస్ఇ కొండా శేషయ్య పరిశీలించారు. బివినగర్, పడారుపల్లి తదితర ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్ళి విద్యుత్ రీడింగ్ ఎలా తీస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. పలుచోట్ల ఆయనే స్వయంగా మీటర్ రీడింగ్ తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీటర్ల రీడర్లు ఇళ్ళకు వెళ్ళి రీడింగ్ తీసే సందర్భాల్లో కొన్నిచోట్ల ఎవరూ లేకపోవడం, ఎత్తైన ప్రదేశాల్లో మీటర్లు బిగించి ఉండడం తదితర సమస్యలను ఆయన స్వయంగా తెలుసుకున్నారు. స్కాన్ చేసి ఇచ్చిన బిల్లుల ద్వారా ఖచ్చితమైన మీటర్ రీడింగ్ వస్తుందని, దీనివల్ల వినియోగదారులు నష్టపోకుండా ఉంటారని చెప్తూ, మీటర్ల రీడింగ్ తీసేవారికి అందుబాటులో ఉండేవిధంగా మీటర్లు అమర్చుకోవాలని ఆయన వినియోగదారులకు సూచించారు.

## విద్యార్థి సంఘం

# ఆందోళన

ప్రభుత్వ నిబంధనలు పాటించని కార్పొరేట్, ప్రైవేట్ జూనియర్ కాలేజీలపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చైతన్య డిమాండ్ చేశారు. ఈనెల 7న ఆ సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులు ధర్నాందోళన నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, ప్రధాన కార్యదర్శి నాసిర్, నాయకులు రాఖీ, సులేమాన్, లలిత, సాయి తదితరులు పాల్గొన్నారు.

### ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో

# హ్యుండాయ్ ప్రాంగణ ఎంపికలు



కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టి ఇంజనీరింగ్ కళాశాలలో హైదరాబాద్‌లోని ఆర్‌అండ్‌బి విభాగాలకు చెందిన హ్యుండాయ్ కార్ల సంస్థవారు ఇంజనీరింగ్ ఆఖరి సంవత్సరం చదువుతున్న మెకానికల్ విభాగానికి చెందిన విద్యార్థులకు ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికలు నిర్వహించడానికి కెంపెనీ హెచ్‌ఆర్ ప్రతినిధి విశ్వనాథ్ వచ్చారు. ఈ ఎంపికలకు మొత్తం 112మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరికి ముందుగా ఆన్‌లైన్‌లో ఉద్యోగ విధివిధానాల గురించి విద్యార్థులకు వివరించారు. తరువాత విద్యార్థులకు ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించారు. కంపెనీ ప్రతినిధి విశ్వనాథ్ మాట్లాడుతూ గత 5 సంవత్సరాలుగా తమ కంపెనీ వారు ఈ కళాశాలకు వచ్చి విద్యార్థులను ఎంపిక చేసుకోవడం జరుగుతుందని, వీరికి ఆన్‌లైన్‌లోనే తదుపరి రౌండ్‌లైన టెక్నికల్, హెచ్‌ఆర్ ఇంటర్వ్యూలు జరుగుతున్నట్లు తెలిపారు. దీనిలో ఎంపిక అయిన విద్యార్థులకు వార్షిక వేతనం రూ.3.50 లక్షలు ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాంగణ ఎంపికల అధికారి డాక్టర్ డబ్ల్యు.కిషాంధర్, మెకానికల్ విభగాధిపతి విక్రమ్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

### అందరూ ఒక్కటయ్యారు..

# గురువులను సన్మానించుకున్నారు

**ఇనమడుగులో 27 ఏళ్ళనాటి పూర్వ విద్యార్థుల సమ్మేళనం**



వారంతా ఎప్పుడో ఇరవై ఏడు సంవత్సరాల క్రితం ఆ బడిలో పదవ తరగతి చదువుకున్నారు. అయినా పాత స్నేహితాలు, ఆ మధురానుభూతులను మరచిపోకుండా అందరూ కలసి ఆ బడికొచ్చి తమకు పాఠాలు చెప్పిన నాటి గురువులను సాదరంగా ఆహ్వానించి సన్మానించుకుని కృతజ్ఞతలు చెప్పుకున్నారు. ఈనెల 7న కోవూరు మండలం లోని ఇనమడుగు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. 1989-94 సంవత్సరంలో టెన్త్ చదువుకున్న ఆ విద్యార్థులంతా ఇప్పుడు సమాజంలో వివిధ స్థాయిల్లో పనిచేస్తున్నారు. ఇన్నేళ్ళ తర్వాత ఇప్పుడు అందరూ కలిశారు. వారి ఆనందం వర్ణనాతీతం. పాఠశాల క్రీడామైదానమంతా కలియదిరిగారు. తాము చదువుకున్న తరగతి గదులను పదేపదే చూసుకుని మురిసిపోయారు. పాఠశాల పూర్వ విద్యార్థులు కొండా అనిల్‌రెడ్డి, సురేఖ, విజిత, మహేష్, సురేష్ తదితరులంతా ఈ కార్యక్రమం నిర్వహించి చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుని ఎంతో ఆనందించారు. తాము ఇప్పుడు ఎక్కడ పనిచేస్తున్నారో ఒకరికొకరు తెలుసుకుని సంతోషించారు. తాము చదువుకున్న రోజులనాటి మధురస్మృతులను గుర్తు చేసుకుని సంబరపడిపోయారు. తమకు చదువు చెప్పిన అయ్యవార్లను, ఇప్పుడు పనిచేస్తున్న ఉపాధ్యాయులను అందరినీ ఈ సమావేశానికి ఆహ్వానించారు. అప్పట్లో ఉపాధ్యాయులు తమపట్ల చూపిన ఆదరణను, అభిమానాన్ని గుర్తుకు తెచ్చుకుని ఆ గురువులందరికీ కృతజ్ఞతగా వందనాలు సమర్పించుకున్నారు. పూర్వ విద్యార్థులందరూ కలసి తమను తీర్చిదిద్దిన ఆ పాఠశాల అభివృద్ధికి తమ శక్తి మేరా విరాళం ఇస్తామని ప్రకటించి పాఠశాల పట్ల తమకున్న అభిమానాన్ని చాటుకున్నారు. ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాధారాణి, పూర్వ ఉపాధ్యాయులు రామలింగయ్య, శ్రీరామమూర్తి, సింగరాచార్యులు తదితరులు పాల్గొని పూర్వ విద్యార్థులందరినీ ఆత్మీయంగా ఆశీర్వదించారు.

# నడకే.. దివ్యౌషధం

నడకే ఆరోగ్యానికి దివ్యౌషధమని, ప్రతిఒక్కరూ క్రమబద్ధంగా ఉదయాన్నే నడక సాగించాలని నెల్లూరులోని ఏసి సుబ్బారెడ్డి వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ఈనెల 7న నగరంలోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో ఏర్పాటుచేసిన ఉచిత వైద్యశిబిరంలో అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు బాసం శేషగిరిరావు, చింతా ప్రసాద్‌బాబు మాట్లాడుతూ నడక వల్ల అనేక శారీరక రుగ్మతలు సమసిపోతాయన్నారు. ఈ సందర్భంగా చెన్నై హాస్పిటల్స్ ఇన్ఫర్మేషన్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యులు మొయినుద్దీన్, నాగమణి, లక్ష్మిలతో పాటు అసోసియేషన్ సభ్యులు తుంగా సుబ్బరామిరెడ్డి, కిలారి తిరుపతినాయుడు, రాఘవేంద్రషెట్టి, జికె గోపీనాథ్, స్నేహసురేష్, శ్రీనివాసరావు, వేణుగోపాలరెడ్డి, నరేంద్రరెడ్డి, రాజానాయుడు, రఘురామ్, మాధవరావు, నారాయణరావు, సుంకర మధు, సి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

## 'ఆపస్'.. కొత్త కార్యవర్గం

ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) జిల్లా శాఖకు ఈనెల 7న నెల్లూరులో జరిగిన ఆ సంఘం సమావేశంలో కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షునిగా కెకె రాజగోపాలాచార్యులు ఎన్నిక కాగా, ప్రధాన కార్యదర్శిగా ఎస్ చంద్రమౌళి ఎన్నికయ్యారు. జిల్లా గౌరవాధ్యక్షునిగా టి.రమేష్‌బాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకునిగా ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు సిహెచ్ శ్రావణ్‌కుమార్, ఎన్నికల అధికారులుగా కావలి పెంచలయ్య, మంచు వెంకటేశ్వర్లు పాల్గొని ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించారు. ఆపస్ రాష్ట్ర సహాధ్యక్షుడు ఎం.చక్రపాణితో పాటు బాలు సుబ్బారావు, పుట్టా శేషులు తదితరులు పాల్గొన్నారు.

### గంజాయి ముఠా

## గుట్టు రట్టయ్యింది

**32 కిలోల సరుకు పట్టివేత**

పోలీసులు ఎంత గట్టిగా హెచ్చరికలు చేస్తూనే ఉన్నా ఎక్కడో ఒకచోట గంజాయి వ్యాపారం జోరుగా సాగుతూనే ఉంది. తాజాగా ఈనెల 8న జిల్లాలోని కావలి పోలీసులు ఓ గంజాయి ముఠాను పట్టుకున్నారు. వెంకటాచలం మండలం లోని గొలగమూడికి చెందిన షేక్ వల్లీ బాషా, పఠాన్ నాగూర్‌లు విశాఖపట్నం లోని అరకు తదితర అటవీప్రాంతాల నుంచి చాటుమాటుగా గంజాయిని కొనుగోలు చేసి బెంగుళూరులో విక్రయించడానికి తరలిస్తుండగా మార్గమధ్యంలో కావలి దగ్గర ముసునూరు ప్రాంతంలో పోలీసులకు దొరికిపోయారు. కావలి డిఎస్పీ ప్రసాద్‌రావు ఆదేశాలతో సిఐ అక్కేశ్వరరావు, ఎస్‌ఐలు మాల్యాద్రి, ప్రతాప్‌లు తమ సిబ్బందితో ముసునూరు టోల్‌ప్లాజా వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా ఈ ముఠా గుట్టు రట్టయింది. ఈ వాహనంలో అరకిలో వంతున ఉన్న 64 గంజాయి ప్యాకెట్లను, వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని, నిందితులను అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### • శ్రీసిటీలో...

# అత్యాధునిక.. గోల్ఫ్ గ్రౌండ్



**ప్రారంభించిన జపాన్ కాన్సుల్ జనరల్ టగా మసయుకి**

పరిశ్రమల హబ్‌గా అంతర్జాతీయ ఖ్యాతి గడించిన శ్రీసిటీలో అటు పరిశ్రమలకు అనువైన వాతావరణమే కాక, పరిశ్రమల ప్రతినిధులకు ఆటవిడుపుగా ఉండేందుకు, ముఖ్యంగా గోల్ఫ్ వంటి క్రీడల పట్ల మరింత ఆసక్తిని పెంపొందించేందుకు శ్రీసిటీ యాజమాన్యం గత కొంతకాలంగా ఎంతో కృషిచేస్తూ ఉండడం విశేషం. ఈ కృషిలో భాగంగా ఇటీవలే శ్రీసిటీలోని దాదాపు పది ఎకరాల విస్తీర్ణంలో ఒక అద్భుతమైన గోల్ఫ్ గ్రౌండ్‌ను కూడా ఏర్పాటుచేశారు. గోల్ఫ్ క్రీడకు సంబంధించి అత్యంత ఆధునిక వసతులతో ఏర్పాటైన ఈ క్రీడా మైదానం శ్రీసిటీకి క్రీడల అభివృద్ధిలో ఉన్న అభిమానాన్ని తెలియజేస్తుంది. ఈ గోల్ఫ్ డ్రైవింగ్ రేంజ్ (గోల్ఫ్ క్రీడా మైదానం)లో గోల్ఫ్ క్రీడాకారులు తమ క్రీడా నైపుణ్యం పెంపొందించుకునేందుకు ఎంతో వీలుంటుంది. అంతేకాదు, కొత్తగా ఈ క్రీడపై ఆసక్తికలిగిన వారు కూడా ప్రాథమిక శిక్షణ పొందేందుకు అనుభవజ్ఞులైన కోచ్‌లను అందుబాటులో ఉంచారు. ఈ అధునాతనమైన గోల్ఫ్ గ్రౌండ్‌ను ఈనెల 7న చెన్నైలోని జపాన్ కాన్సుల్ జనరల్ టగా మసయుకి గోల్ఫ్ మైదానంలోకి దిగి బంతిని కొట్టి ప్రారంభోత్సవం చేశారు. ఇండియన్ గోల్ఫ్ యూనియన్ కోశాధికారి ఈశ్వర్ ఆచంత, ఏపి ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు వీరారెడ్డితో పాటు పలు పరిశ్రమల సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ శ్రీసిటీలో క్రీడా వసతుల అభివృద్ధిలో భాగంగా గోల్ఫ్ గ్రౌండ్‌ను ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. ఈ ప్రారంభోత్సవానికి జపాన్ కాన్సులర్ జనరల్‌తో పాటు పలువురు ప్రముఖులు విచ్చేయడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు. జపాన్ కాన్సులర్ జనరల్ టగా మసయుకి మాట్లాడుతూ జపాన్‌లో ఎంతో ప్రాచుర్యం పొందిన ఈ క్రీడను ఇక్కడ జపాన్ పరిశ్రమల ప్రతినిధులకు చేరువచేసినందుకు శ్రీసిటీ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. గోల్ఫ్ మైదానం ఏర్పాటు పట్ల శ్రీసిటీ కృషిని ఈశ్వర్ ఆచంత కొనియాడుతూ, భవిష్యత్తులో దేశంలోని అత్యుత్తమ గోల్ఫ్ మైదానాల్లో శ్రీసిటీ మైదానం కూడా ఒకటిగా మారుతుందని ఆకాంక్షించారు. ఏపి ప్రభుత్వ సలహాదారు వీరారెడ్డి మాట్లాడుతూ శ్రీసిటీలో పరిశ్రమల స్థాపనతో పాటు దీనిని ఒక మంచి నివాస నగరంగా అభివృద్ధి చేస్తుండడం హర్షదాయకమని శ్రీసిటీ యాజమాన్యాన్ని అభినందించారు. గోల్ఫ్ మైదానాన్ని పరిశ్రమల వారు, క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శ్రీసిటీ కన్సల్టెంట్ అధికారి ఎస్‌పి శర్మ పాల్గొన్నారు.







# కల్యాణ వైభవం...!




గూడూరు వాస్తవ్యులు, రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షులు ఎస్.వి.అశోక్ - వాసంతిల కుమార్తె, ఎస్.వి.వైద్యనాథన్ - శారదమ్మల మనుమరాలు **మీనా(మంజు) - అరుణ్‌సూర్య** (చెన్నై వాస్తవ్యులు జి.మధివనన్ - ఉమామహేశ్వరిల కుమారుడు)ల వివాహం ఇటీవల చెన్నైలోని జి.పి.ఎల్ ఏ.సి మహల్‌లో వైభవంగా జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.

# సమాజ నిర్మాణంలో అతివలే కీలకం

**- సబ్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ**



అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సబ్ కలెక్టర్ కార్యాలయంలో గూడూరు డివిజన్ పరిధిలో పనిచేసే పలువురు ఎమ్మార్వో, ఎంపిడిఓలను, ఇతర మహిళా ఉద్యోగులను సబ్‌కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ, పంచాయతీ శాఖల్లో ఎక్కువమంది మహిళలు ఎంతో సమర్ధవంతంగా పనిచేస్తూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారని, మహిళలు నూతన సమాజ నిర్మాణంలో ఎంతో కీలకమని, మనమందరం మహిళల పట్ల గౌరవంతో ఉండాలని ప్రజలను కోరారు. చిల్లకూరు తహశీల్దార్ గీతావాణి, సైదాపురం ఎంపీడీఓ వాణిరెడ్డి, ఎం.పి.డి.ఓ. నాగమణి, వైద్యాధికారి అచ్యుతకుమారి, ప్రియాంక, ఇతర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# వ్యాక్సిన్ వేసుకున్న 'వైద్య రాజం'



తమిళనాట తెలుగువారి ప్రతినిధిగా, తెలుగువారి హక్కుల కోసం నిరంతరం పోరాటం సాగించే సుప్రసిద్ధి వైద్యులు డాక్టర్ చిల్లకూరు ముద్దుకృష్ణారెడ్డి తమ సతీమణి నిర్మల సమేతంగా మార్చి 7వ తేదీ ఆదివారం ఉదయం చెన్నైలోని అపోలో ఆసుపత్రిలో కోవిడ్ వ్యాక్సిన్ తీసుకున్నారు. కోవిడ్ నివారణ కోసం వ్యాక్సిన్ బాగా సహకరిస్తుందని, ప్రతిఒక్కరూ తప్పకుండా వ్యాక్సిన్ వేసుకోవాలని ఆయన కోరారు.

# మహిళా సాధికారతను సాధించాలి

**- విఎస్‌యు వీసీ చంద్రయ్య**



నేటికాలంలో మహిళలు అన్నిరంగాల్లో పురోగమిస్తూ పురుషులకు ధీటుగా రాణిస్తున్నారని, ఇదెంతో శుభపరిణామమని, విఎస్‌యు వీసీ చంద్రయ్య అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈనెల 8న విఎస్‌యులో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మహిళా సాధికారత లక్ష్యంగా సమాజంలో అందరూ తమవంతు కృషి చేయాలని కోరారు. ప్రముఖ న్యూరాలజిస్ట్ బిందుమీనన్ మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యం పట్ల అవగాహనతో ఉండాలని, అశ్రద్ధ చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. విఎస్‌యు రిజిస్ట్రార్ ఎల్‌వి కృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ సుజా ఎస్ నాయర్, పాలకుర్తి ఆండాళ్, డాక్టర్ కె.సునీత, డాక్టర్ అల్లం ఉదయ్‌శంకర్, డాక్టర్ వై.విజయ, డాక్టర్ శ్రీకన్యారావు తదితరులు పాల్గొన్నారు.

# నీటి ఎద్దడి లేకుండా చూడండి!

వేసవి కాలం నేపథ్యంలో జిల్లాలో ఎక్కడా నీటి ఎద్దడి లేకుండా ప్రజలకు ఇబ్బందులు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వహణాధికారి పి.సుశీల్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 8న నెల్లూరులోని తన ఛాంబర్‌లో ఆమె అధికారులతో మాట్లాడుతూ జిల్లా నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలను గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. మంచినీటి బోర్లను, ట్యాంకులను పరిశుభ్రంగా ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

# మహిళలకు 'ప్రగతి' సత్కారం



ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో మార్చి 8 తేదీ 'అంతర్జాతీయ మహిళా దినోత్సవం' సందర్భంగా 7వతేదీ ఆదివారం డిఆర్‌డబ్ల్యూ కాలేజీ ఆడిటోరియంలో నలుగురు ప్రముఖ మహిళామూర్తులు చిల్లకూరు తహసిల్దార్ శ్రీమతి పి.గీతావాణి, సబ్‌రిజిస్ట్రార్ శ్రీమతి ఎ.భానుమతి, డిఆర్‌డబ్ల్యూ కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ డా. సి.విజయకళ, చిల్లకూరు అగ్రికల్చర్ ఆఫీసర్ శ్రీమతి జి.భవానిలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన ప్రముఖ డాక్టర్ శ్రీమతి సి.రోహిణి, డిఆర్‌డబ్ల్యూ కాలేజీ ప్రిన్సిపాల్ కమలసాయిల చేతుల మీదుగా సన్మాన కార్యక్రమం నిర్వహిం చారు. అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు బండి ధనంజయరెడ్డి, జాయింట్ సెక్రెటరీ యమహా సుబ్రహ్మణ్యం, ట్రెజరర్ కాటూరి శ్రీనివాసులు, కార్యవర్గసభ్యులు గ్రానైట్ ప్రభాకర్, కార్పొరేషన్ రవికుమార్, ప్రజేంద్రరెడ్డి, ఐటీ ప్రభాకర్, పి.డి కరిముల్లా, తనూజ్, వాచ్‌షాపు రాము, కెఆర్ఎమ్, పూర్ణచంద్ర, కో-ఆర్డినేటర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## గూడూరు డివిజన్ వార్తలు

# 'దిశ' యాప్‌ను ఉపయోగించుకోండి

**- టౌన్ సిఐ దశరథరామారావు**




మహిళలు రక్షణకోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన దిశ యాప్‌ని స్మార్ట్ ఫోన్ కలిగిన మహిళలు అందరూ డౌన్‌లోడ్ చేసుకొని ఆపదకాలంలో రక్షణ పొందాలని గూడూరు పట్టణ సి.ఐ. దశరథరామారావు చెప్పారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా దిశ యాప్ డౌన్‌లోడ్ గురించి ఆదివారం స్థానిక టవర్‌క్లాక్ సెంటర్, కొన్ని మొబైల్ షాపుల వద్ద మహిళలకు గూడూరు పట్టణ సి.ఐ. దశరథ రామారావు, ఎస్.ఐ. సైదులు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. అత్యవసర పరిస్థితులలో, ఆపద సమయాలలో కేవలం దిశ యాప్‌మీద ఒకేఒక్క బటన్ ప్రెస్‌చేస్తే వారు ఆపదలో ఉన్నారన్న విషయాన్ని పోలీస్ కంట్రోల్ రూముకు సమాచారం చేరి పోలీసులు వెంటనే స్పందించి వారికి రక్షణ కల్పించే అవకాశం వుందని టౌన్ సి.ఐ. దశరథరామారావు తెలిపారు. పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధులకు శ్రీకంటి దాతృత్వం



ఎస్.వి.రత్నం చారిటీస్ అధినేత శ్రీకంటి రామ్మోహన్‌రావు దాతృత్వంలో గూడూరు రోటరీక్లబ్ వెస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీ డీఎన్‌ఆర్ కమ్యూనిటీ హాలులో 15 మంది వృద్ధులకు నెలవారీ సరకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీకంటి రామ్మోహన్‌రావు, వైసీపీ సీనియర్ నాయకులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ రోటరీ చేయూత ప్రాజెక్టు కింద నెలవారీ సరుకులు ఇవ్వడం చాలా ఆనందదాయకంగా వుందని, ప్రభుత్వ సహాయం లేని వృద్ధులను ఎంపికచేసి వారికి ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షులు తాళ్లూరు శ్రీనివాసులు మరియు రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

# వారి సేవలకి సలాం

**- మహిళాదినోత్సవ వేడుకల్లో డాక్టర్ సి.రోహిణి**



కరోనా సమయంలో అనేకమంది మహిళా ఉద్యోగులు ప్రజలకు అండగా నిలిచారని, వారి సేవలకు సలాం అని మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ సి.రోహిణి అన్నారు. కరోనా సమయంలో సేవలందించిన మహిళా ఉద్యోగులకు ఆంధ్ర మహిళా మండలి, ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో ఇటీవల సత్కరించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కోనేటి మిట్టలో ఉన్న సితార్ ఫంక్షన్ హాలులో ఈ కార్యక్రమం జరిగింది.



డాక్టర్ సి.రోహిణి మాట్లాడుతూ ఎంతో ధైర్యంగా సేవలందించిన మహిళలను సన్మానించడం ఎంతో సంతోషంగా ఉందని, ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా మహిళలకు సముచిత స్థానం ఇచ్చినట్టు ఉంటుందని అన్నారు. మహిళా పోలీస్ పి.లక్ష్మీస్వరూప్, ఆశావర్కర్ కె.జానకి, హెడ్‌నర్స్ టి.గౌరి, అంగన్‌వాడీ కార్యకర్త పి.జోత్స్న, వార్డు వాలంటీర్ కె.దీప్తి, శానిటరీ సెక్రటరీ అన్నపూర్ణ, పి.హెచ్. కాంట్రాక్టర్ కమలకుమారి తదితరులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రమహిళా మండలి అధ్యక్షులు ఇంద్రసేన, పి.ఎస్.రాజ్యలక్ష్మి, స్నేహలత, ప్రభారెడ్డి, కె.సరిత, కె.శాంతి ఇన్నర్‌వీల్ మహిళామండలి సభ్యులు రొటేరియన్స్ డాక్టర్ పి.జనార్ధన్‌రెడ్డి, కనుమూరి హరిశ్చంద్రారెడ్డి, దశరథరామిరెడ్డి, కె.మునిగిరీష్, కోటానీత్ కుమార్, రమణబాబు పాల్గొన్నారు.



ఈ నెల 8వ తేదీ ఎఐఐఇఓ ఇచ్చిన పిలుపు మేరకు ఎల్ఐసి కార్యాలయం ఆవరణంలో ఇనిషియల్ పబ్లిక్ ఆఫరింగ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న ఎల్ఐసి సిబ్బంది శివకుమార్, రాజశేఖర్‌రెడ్డి, డి.బి.శ్రీనివాసరావు, మహబూబ్‌బాషా తదితరులు

# పొగమంచు తెచ్చిన ప్రమాదం

- **ఒకదాని వెంట మరొకటిగా వాహనాలు ఢీ**
- **డ్రైవర్లకు గాయాలు**




దట్టంగా కమ్ముకున్న పొగ మంచుతో దారి సరిగా కనిపించక పలు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో పలువురికి గాయాలయ్యాయి. దుత్తలూరు మండలంలోని తెడ్డుపాడు గ్రామం దగ్గరున్న పిల్లాపేరు వాగు వంతెన వద్ద ఈనెల 7వ తేది వేకువన ఈ ప్రమాదం జరిగింది. జాతీయరహదారిపై మరమ్మతులకు గురైన ఒక లారీని వాహన దారులు రోడ్డుపక్కన నిలిపి ఉంచగా, ఆ మార్గంలో వెళ్తున్న ఒక ప్రైవేటు బస్సుకు అది కనిపించక, వెనుకనుంచి వచ్చి ఢీకొంది. అదే సమయంలో వేగంగా వస్తున్న మరో ఆర్టీసి బస్సు దానిని ఢీకొట్టడం, దాని వెనుకే వస్తున్న లారీ ఆ ఆర్టీసి బస్సును ఢీకొట్టడం వెంటవెంటనే జరిగిపోయాయి. ఈ ప్రమాదంలో నాలుగు వాహనాలు దెబ్బతిన్నాయి. డ్రైవర్లకు స్వల్పంగా గాయాలయ్యాయి. అయితే బస్సుల్లో ఉన్న ప్రయాణీకులకు అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ప్రయాణీకులు బతుకుజీవుడా అనుకుంటూ బయటపడ్డారు. ఈ సంఘటన సమాచారం అందుకున్న దుత్తలూరు పోలీసులు సంఘటన ప్రాంతాన్ని సందర్శించి దర్యాప్తు చేస్తున్నారు. అయినా పొగమంచు బాగా ఆవరిస్తున్న నేటి రోజుల్లో వాహనదారులు ఎంతో అప్రమత్తంగా ఉండకుంటే ప్రమాదాలు తప్పవు. వాహనాలను మితిమీరిన వేగంతో నడపడం వల్ల ప్రమాదాలను కొనితెచ్చుకున్నట్లే. వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు నిబంధనలు, జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి. అదేవిధంగా, రాత్రివేళల్లో రోడ్లమీద వాహనాలకు ప్రమాదాలు జరగకుండా సంబంధిత అధికారులు, పోలీసులు కూడా తగు జాగ్రత్తలు తెలియజేసే హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేస్తే కొంతలో కొంతైనా ప్రయోజనం ఉంటుంది.

# కరాటేలోనూ నెల్లూరు ఫస్ట్!



కరాటే పోటీల్లో నెల్లూరు క్రీడాకారులు ప్రతిభతో రాణిస్తూ తమ సత్తా చాటుతున్నారు. ఈనెల 7,8 తేదీల్లో గుంటూరు జిల్లాలో జరిగిన జవహర్‌లాల్ నెహ్రూ మెమోరియల్ ఇంటర్ స్టేట్ ఇన్విటేషన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో నెల్లూరులోని బుడోకాన్ కరాటే ఫెడరేషన్‌కు చెందిన క్రీడాకారులు పతకాలు సాధించారని ఆ ఫెడరేషన్ మాస్టర్ ఎస్.విజయకుమార్, ఇన్‌స్ట్రక్టర్ శ్రావణ్‌కుమార్‌లు పేర్కొన్నారు. కటా విభాగంలో ఎస్‌కె ముసాబ్ ప్రథమస్థానం, ఆరంజ్ బెల్ట్ కటా విభాగంలో సూర్యతేజ ప్రథమస్థానం, ఎల్లో బెల్ట్ కటా విభాగంలో లిఖిత ద్వితీయ స్థానం, ఎల్లో బెల్ట్ కుమితే విభాగంలో ఎస్‌కె ఈద్రిస్ ప్రథమ స్థానం సాధించారని పేర్కొన్నారు. విజేతలైన వీరందరిని వారు ఈ సందర్భంగా అభినందించారు.

### పోలేరమ్మతల్లికి..

# ప్రత్యేక పూజలు

బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని జొన్నవాడ గ్రామదేవత పోలేరమ్మ అమ్మవారికి ఈనెల 7న ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని తూర్పువీధిలో ఉన్న అమ్మవారి ఆలయం వద్ద కలశస్థాపన చేసి భక్తిశ్రద్ధలతో గణపతి పూజ చేశారు. అనంతరం గ్రామం సుభిక్షంగా ఉండాలని ప్రార్థిస్తూ అమ్మవారికి శాంతిపూజలు చేశారు. గ్రామ సర్పంచ్ పెంచలయ్య, వైస్ సర్పంచ్ మస్తానయ్యలతో పాటు పోలేరమ్మ, కనక దుర్గమ్మ అమ్మవార్ల ఉత్సవాల కమిటీ సభ్యులు, పెద్దసంఖ్యలో స్థానిక ప్రజలు, భక్తులు ఈ పూజల్లో పాల్గొని పోలేరమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు.

### పుస్తక పఠనం వల్ల

# ఎన్నో ఉపయోగాలు

పుస్తక పఠనం వల్ల ఎన్నో ఉపయోగాలున్నాయని, విద్యార్థులంతా గ్రంథాలయాలకు వెళ్తూ పుస్తక పఠనాన్ని అలవరచుకుని విజ్ఞానాన్ని సముపార్జించుకోవాలని కొండాపురం మండల విద్యాశాఖాధికారి కె.రవికుమార్ అన్నారు.

ఈనెల 7న ఆయన కొండాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడు చల్లా చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన 'చదవడం మాకిష్టం' కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులచే కథల పుస్తకాలను చదివించి అందులోని నీతిని బోధించారు. విద్యార్థులకు పలు పుస్తకాలను బహుమతులుగా అందజేశారు. గ్రంథాలయాధికారి కొండయ్య, ఉపాధ్యాయుడు శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ మహిళా పోలీసులు

## డిజిపి చేతుల మీదుగా ఇద్దరికి విశిష్ట పురస్కారాలు

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా ఉత్తమ సేవలందిస్తున్న మహిళా పోలీసులకు ఈనెల 8న మంగళగిరిలో డిజిపి గౌతం సవాంగ్ చేతుల మీదుగా విశిష్ట పురస్కారాలను అందజేశారు. వారిలో నెల్లూరుజిల్లాకు చెందిన ఒక ఎస్ఐకి, ఒక కానిస్టేబుల్‌కు ఈ అవార్డులు లభించాయి. జిల్లా 'దిశ' పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా అంకితభావంతో విధులు నిర్వహిస్తున్న కూచిపూడి స్వప్న, ఎంతో ధైర్యంగా నాటుసారా తయారీని అడ్డుకుంటున్న చిల్లకూరు మహిళా కానిస్టేబుల్ సంపూర్ణ ఈ విశిష్టమైన అవార్డులను అందుకుని అందరి అభినందనలు అందుకున్నారు.

### అపరిచితులతో జాగ్రత్త..

# చాటింగ్‌లతో మోసపోకండి

**అమ్మాయిలకు ఏఎస్పీ వెంకటరత్నం సూచన**



అమ్మాయిలు ఇటీవలికాలంలో ఫోన్‌లు బాగా వినియోగిస్తున్నారని, అయితే ఈ సాంకేతిక విజ్ఞానాన్ని ఆసరాగా చేసుకుని కొంతమంది వారిని వంచన చేస్తున్నారని, ఈ నేపథ్యంలో అమ్మాయిలు ఫోన్‌లలో చాటింగ్ చేసేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలని, పరిచయం లేనివాళ్ళతో చాటింగ్ చేయడం మంచిది కాదని ఏఎస్పీ పి.వెంకటరత్నం సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నెల్లూరులోని గౌతమబుద్ధ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా వాకర్స్ అసోసియేషన్ వారు ఈనెల 7న ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మహిళలు సమాజంలో ఎలాంటి మోసాలకు, నయవంచనలకు గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ నాయకులు ఎంవి సుబ్బారెడ్డి, ఏకుల రాఘవరెడ్డి, నలుబోలు బలరామయ్యనాయుడు, మహిళా వాకర్స్ ప్రతినిధులు భారతి, రమాదేవి, సుభాషిణి, వేదవతి, సుధారాణి, గౌతమబుద్ధ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జయప్రకాష్, అరవ రాయప్ప, డాక్టర్ కెఎస్ రాజు, ఏ.రామ్మోహన్, ప్రసాద్, పిట్టి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ ఉద్యోగులకు క్రీడా పోటీలు 21 నుంచి

ఏపి విద్యుత్ ఉద్యోగుల ఇంటర్ సర్కిల్ క్యారమ్స్, చెస్, టెన్నిస్ క్రీడా పోటీలు ఈనెల 21 నుంచి 23వ తేది వరకు జరుగుతాయని జిల్లా స్పోర్ట్స్ జనరల్ సెక్రటరీ శ్రీహరిరావు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి విద్యుత్ ఉద్యోగులు ఈ క్రీడా పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

# 3 వందల ఏళ్ళనాటి ..'సుబ్రమణ్యం' స్వామి దేవాలయం

***జిల్లాలో ఉన్న పలు ప్రసిద్ధమైన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయాల్లో 'సుబ్రమణ్యం' గ్రామంలోని వళ్ళీ–దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం ఒకటి. సుబ్రహ్మణ్యంస్వామి ఆలయం ఉన్న ఊరు కనుక ఈ గ్రామానికి కూడా 'సుబ్రమణ్యం' అనే పేరు స్థిరపడడం విశేషం. ఇది పురాతనమైనదే కాక.. మరెంతో మహిమగల ఆలయంగా కూడా ప్రసిద్ధి. ఎంతటి కష్టాలైనా స్వామివారికి మొక్కుకుంటే తీరిపోతాయని ప్రతీతి. అందరినీ కాపాడే దైవంగా, మరెందరికో ఇలవేల్పుగా 'సుబ్రమణ్యం' సుబ్రహ్మణ్యేశ్వరస్వామి అందరి పూజలందుకుంటున్నాడు.***





**మన దేవాలయాలు (38)**

'సుబ్రమణ్యం' గ్రామం శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని బాలాయపల్లి మండలంలో ఉంది. నెల్లూరు నుంచి వెంకటగిరికి, లేదా గూడూరు నుంచి వెంకటగిరికి వెళ్ళే రోడ్డుమార్గంలో ఉన్న మండల కేంద్రం బాలాయపల్లి. అక్కడ నుంచి కేవలం రెండున్నర కిలోమీటర్ల దూరంలోనే సుబ్రమణ్యం' గ్రామం ఉంది. ఈ గ్రామానికి వెళ్లేందుకు మంచి రోడ్డుమార్గం ఉండడమే కాక, బాలాయపల్లి కూడలి వద్ద నుంచి ఈ దేవాలయానికి వెళ్ళేందుకు భక్తులకు ఆటో సౌకర్యం కూడా ఉంది. దీంతో భక్తులు నిత్యం పెద్దసంఖ్యలోనే ఈ గ్రామానికి వచ్చి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారిని దర్శించుకుంటూ ఉంటారు.

## ఆలయ చరిత్ర :

ఈ ఆలయం 3 వందల ఏళ్ళ క్రితం నాటిదని చరిత్ర. సుమారు 1700 సంవత్సరం ప్రాంతంలో వెంకటగిరి రాజా వెలుగోటి కుమార యాచమనాయుడు ఈ ఆలయాన్ని నిర్మించారని ఆలయంలోని శాసనాలను బట్టి తెలుస్తోంది. ఆలయ నిర్మాణానికి సంబంధించి పలు కథనాలు కూడా ఉన్నాయి. అప్పట్లో వెంకటగిరి రాజావారైన కుమార యాచమనాడు ఈ ప్రాంతానికి వేటకు వచ్చారు. ఆయనిక్కడ విశ్రమించిన సమయంలో ఆదమరచి నిద్రపోయారు. ఆ నిద్రలో.. ఇక్కడ ఆలయం నిర్మించాలని భగవంతుడు చెప్పినట్లుగా ఆయనకు కల వచ్చింది. కళ్ళు తెరచిన రాజావారు దైవాజ్ఞ మేరకు వెంటనే ఆలయ నిర్మాణానికి ఉపక్రమించారు. ఎన్నో రోజులు శ్రమించి కాశీరాళ్ళు అనే నల్లటి కొండరాళ్ళతో ఆలయాన్ని అత్యద్భుతంగా తీర్చిదిద్దారు. గర్భాలయంలో వళ్ళీ–దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి విగ్రహమూర్తులను ప్రతిష్ఠించారు. స్వామివార్లకు నిత్యపూజాదికలు నిరంతరాయంగా జరిగేలా అన్ని ఏర్పాట్లు చేశారు. ఎంతో మహిమాన్వితుడైన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కొలువై ఉన్న గ్రామం కనుక ఈ గ్రామానికి 'సుబ్రహ్మణ్యం' అనే పేరునే ఖాయం చేశారు. నాటినుంచి నేటికీ వాడుకలో ఈ గ్రామం 'సుబ్రమణ్యం' గ్రామంగా జిల్లాలో ప్రసిద్ధి చెందుతూ ఉంది. ఈ ఆలయాన్ని నిర్మించిన కుమార యాచమనాయుడు, ఆయన సతీమణితో పాటు అప్పటి ఆలయ ధర్మకర్తల హయాంలో ఈ కోవెల ఎంతో వైభవంగా ఉండేది. కాలక్రమంలో ఆలయం శిథిలావస్తకు చేరుకుంది. దీంతో ఇటీవలికాలంలో గ్రామస్తులు, దాతలు, వెంకటగిరి, గూడూరు తదితర గ్రామాల్లోని భక్తులు అందరూ కలసి ఆలయాన్ని పునరుద్ధరించి సాధ్యమైనంతవరకు అభివృద్ధి చేసి ఆలయానికి పూర్వవైభవం తీసుకువచ్చారు.

## రాతిస్తంభాలు.. అరుదైన శిల్పాలు :

నాటి రాజాల ఆధ్వర్యంలో నిర్మితమైన ఈ ఆలయంలో అడుగడుగునా అత్యద్భుతమైన శిల్పకళావైభవం తొణికిసలాడుతుంటుంది. పెద్దపెద్ద రాతిస్తంభాలతో, కనువిందు చేసే మండపాలు, మందిరాలతో ఆలయం భక్తులందరినీ బాగా ఆకట్టుకుంటోంది. ఆలయ ప్రాంగణంలో శివపార్వతులు కూడా కొలువై ఉన్నారు. గర్భగుడిని ఆనుకునే శివలింగం, కొద్దిదూరంలోనే పార్వతిదేవి(ఆనందవళ్ళి)తోపాటు, అమ్మవారి పాదాల వద్ద మంత్రయుక్తమైన శ్రీచక్రం ప్రతిష్టించబడి ఉంటాయి. ఆలయానికి దక్షిణభాగంలో విఘ్నేశ్వరుని గుడి, ఈశాన్యంలో జ్వాలాముఖేశ్వరుని ఆలయంతో పాటు నాగప్రతిమలు కూడా ఉన్నాయి.

## భక్తుల బాధలు తీర్చే సుబ్రహ్మణ్యస్వామి :

ఆలయంలో కొలువై ఉన్న శ్రీ సుబ్రహ్మణ్యేశ్వం స్వామివారిని కొలుచుకుంటే అనుకున్నవి జరుగుతాయని, కోరుకున్నవి నెరవేరుతాయని ప్రతీతి. ముఖ్యంగా వివాహం కావాల్సినవారు, లేదా సంతానం లేక బాధపడేవారు, ఆపదల్లో ఉన్నవారు స్వామివారికి మొక్కుకుంటే ఆ సమస్యలన్నీ తీరిపోతాయి. స్వామివారికి నిత్యోత్సవాలు, ప్రతి ఏటా శివరాత్రి వేడుకలు వైభవంగా జరుగుతుంటాయి. ప్రతి మంగళవారం భక్తుల ఆధ్వర్యంలో అన్నదానం జరుగుతూ ఉంటుంది. అయితే ఈ ఆలయాన్ని ఇంకా బాగా అభివృద్ధి చేయాల్సి ఉంది. ముఖ్యంగా.. ఎంతోకాలంగా శిథిలావస్తలో ఉన్న స్వామివారి రథాన్ని, రథ మండపాన్ని, ఆలయంలో ఉన్న రాతి మండపం వగైరాలను బాగుచేయించేందుకు స్థానిక భక్తులు, దాతలు అందరూ కలసి మరింతగా కృషిచేయాల్సి ఉంది.

# బాలు పాట - మాట నిలిచే ఉంటాయి

(5వ పేజీ తరువాయి)



## అద్వితీయం.. స్వర నీరాజనం :

'పాడుతా తీయగా' గాయకులుగా అందరి ప్రశంసలందుకున్న గాయకులు సుగంధిని, మమన్, నరసింహ, అనూష, జ్ఞానశ్రీ, ప్రశాంతి, రాజశేఖర్‌లు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ అత్యద్భుత గానంతో శ్రోతలను మైమరపించారు.

బాలు గారికి ఎంతో పేరు తెచ్చిన పాటలను ఏర్చికూర్చి తమ సుస్వరాలతో అర్చించి స్వర నీరాజనాలర్పించారు. 'సంగీత సాహిత్య సమలంకృతే', 'ఓంకార నాదాను సంధానమౌ గానమే'. 'పల్లవించవా నా గొంతులో', 'ఏ దివిలో విరిసిన పారిజాతమో', 'తొలివలపే తీయనిది', 'మధుమాస వేళలో', 'వేదం అణువణువున నాదం'.. వంటి అత్యద్భుతమైన పాటలతో గాయనీ గాయకులు శ్రోతలను మంత్రముగ్ధులను చేశారు. వీరికి శాంతికుమార్, ఖాదర్‌బాషా(తబలా), సంగీత్ సౌరభ్, విజయ్(కీబోర్డు), గిరి (ప్యాడ్) వాద్యాలతో సహకరించారు. బాలు తనయుడు చరణ్ కూడా వారితో కలసి పలు పాటలు హృద్యంగా ఆలపించి అందరి కరతాళధ్వనులందుకున్నారు.

## సాహితీ నీరాజనాలు :

బాలు గారిని స్మరించుకుంటూ ప్రముఖ కవి చిన్ని నారాయణరావు, కవయిత్రి శ్రీమతి ధాన్యలక్ష్మిలు ఈ సందర్భంగా తమ కవితలను శ్రావ్యంగా వినిపించి ఎస్పీ బాలుకు కవితా నీరాజనాలర్పించారు. ప్రముఖ విద్యావేత్త వివిస్ రామచంద్రరావు గారి తనయుడు వెన్నెలగంటి ప్రసాద్, బాలు గారిపై రచించిన కవితను బాలు గారి తనయుడు చరణ్‌కు జ్ఞాపికగా అందజేసి అందరి ప్రశంసలందుకున్నారు.



## పేద కళాకారులకు సాయం :

బాలు గారి స్మారకంగా జిల్లాలోని అయిదుగురు పేద కళాకారులకు కళాంజలి సంస్థ తరఫున తమవంతు ఆర్థికసాయంగా రెండువేల రూపాయల వంతున సాయం అందజేశారు. ప్రముఖ గాయకుడు రఘురామ్ కుటుంబసభ్యులకు, మరో గాయకుడు వెంకయ్య, తబలిస్ట్‌లు లక్ష్మీకాంతరావు, మానుచాంద్ బాషా, సుబ్రహ్మణ్యంలకు ఆర్థిక సాయం అందించి కళాంజలి సంస్థ తన కళాభిమానాన్ని చాటుకుంది.

## పాటల పోటీల విజేతలు :

బాలు స్మారకంగా నిర్వహించిన సినీసంగీత పోటీల్లో విజేతలకు ఈ సందర్భంగా బాలు తనయుడు చరణ్ చేతుల మీదుగా బహుమతులందజేశారు. ఈ పోటీల్లో జూనియర్స్ విభాగంలో పి.సుహాన్ ప్రథమ బహుమతి సాధించగా, కె.అవనీష్, ఏ.వేదిత ద్వితీయ తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. ఎం.వరుణ్, వి.సంయుక్త, ఏ.శ్రీకృతిలకు కన్సొలేషన్ బహుమతులు లభించాయి. అదేవిధంగా, సీనియర్స్ విభాగంలో వి.సాయి ఉమామహేశ్వరి ప్రథమ బహుమతి సాధించింది. ఏ.గాయత్రి, ఎం.డి మొతహర్‌బేగం ద్వితీయ తృతీయ బహుమతులు సాధించారు. ఏ.సాత్విక్, వినీష్‌చౌదరి, ఎం.ప్రభాకర్ రావులకు కన్సొలేషన్ బహుమతులు లభించాయి. అందరికీ బాలు గారి ఫోటో జ్ఞాపికలను ఇచ్చి అభినందించారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించిన ప్రముఖ సంగీత విద్వాంసులు ఏ. లక్ష్మీప్రసన్న, ఎం.లోకేష్‌లను కళాంజలి అనంత్ తరఫున నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. అనంతరం వేదికనలంకరించిన ప్రముఖులందరినీ కళాంజలి సంస్థ ఘనంగా సన్మానించింది.

ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతలుగా అరుణ్, దువ్వూరు బెనర్జీ వ్యవహరించగా, బిల్లీ శ్యాంసన్, ఎన్.సురేష్, నాతా కృష్ణకుమార్, వై.విశ్వనాథం, వైష్ణవి, పి.వంశీ తదితరులంతా కార్యక్రమ నిర్వహణకు ఎంతగానో సహకరించారు. వేదికపై బాలు స్మారకంగా ఏర్పాటుచేసిన బ్యానర్లు అందరినీ బాగా ఆకట్టుకున్నాయి.

కార్యక్రమం జరుగుతున్నంతసేపు పురమందిరం ప్రేక్షక జనసందోహంతో క్రిక్కిరిసిపోయింది. బాలు గారికి ఇంత అద్వితీయమైన రీతిలో స్వర నీరాజనం గావించిన 'కళాంజలి'కి, కార్యక్రమ రథసారథి అనంత్‌కు 'లాయర్' శుభాకాంక్షలు!....



# తెలుగువారి 'భాగ్య'నగరం హైదరాబాదే!

23 జిల్లాలతో ఒక్కటిగా ఉన్న తెలుగు రాష్ట్రాన్ని చూసి కన్నుకుట్టిన కాంగ్రెస్ మాత - ఓ 13 జిల్లాలను విడగొట్టి, దానికి ఆంధ్రప్రదేశ్ అనే పేరే ఉంచింది.

రాష్ట్రాన్ని భౌగోళికంగా విడగొట్టగలిగారు గానీ, 'ఈ హైదరాబాద్ మాది....మా తెలుగు వారందరిదీ...' అనే భావన నుంచి మాత్రం ఢిల్లీ దొంగలు దూరం చేయలేకపోయారు.

కొత్త రాష్ట్రానికి ఐదేళ్ల పాటు తొలి ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబునాయుడు- ఆ ఐదేళ్లు బెజవాడలో ఓ ఇల్లు అద్దెకు తీసుకుని ఉన్నారు గానీ... అక్కడ ఇల్లు కట్టుకో లేదు. హైదరాబాద్‌లో మాత్రం సర్వాంగ సుందరమైన... అత్యాధునికమైన ప్యాలస్‌ను కట్టుకున్నారు. నారా లోకేష్‌కూ బెజవాడలో సొంతిల్లు లేదు. వాళ్ళ వ్యాపార లావాదేవీల ప్రధాన కార్యాలయమూ హైదరాబాదే. దానిమీద కట్టాల్సిన పన్నులూ తెలంగాణ ప్రభుత్వానికే.

చంద్రబాబు పొలిటికల్ మాన్యుపులేషన్‌లో నంబర్ 2 అయిన యనమల రామకృష్ణుడి అందాల హర్మ్యమూ హైదరాబాద్‌లోనే. చంద్రబాబు ప్రభుత్వంలో పనిచేసిన మంత్రులు, ఎం.ఎల్.ఏలలో అత్యధికుల కొంపా గోడూ, గెస్ట్‌హౌసులూ కూడా హైదరాబాద్‌లోనే. చంద్రబాబు హయాంలో డీజీపీలుగా, చీఫ్ సెక్రటరీలుగా పనిచేసిన వారు ఇప్పుడు ఉండేది హైదరాబాద్‌లోనే.






విజయవాడ, గుంటూరు, వాటి చుట్టుపక్కల ఉండే ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేసే ఉద్యోగుల్లో నూటికి 80 మంది స్థిరనివాసాలు హైదరాబాద్‌లోనే. వారి సైడ్ బిజినెస్సులు, వడ్డీ వ్యాపారాలు, చిట్టీ పాటలు, రియల్ ఎస్టేట్ లావా దేవీలు, సెటిల్మెంట్లు, దందాలూ- అన్నీ హైదరాబాద్‌లోనే. శుక్రవారం మధ్యాహ్నం నుంచే సామాన్లు సర్దేసి బయలుదేరేది హైదరాబాద్‌కే.

ఆంధ్రాలో స్థానిక ఎన్నికలు నిర్వహించే నిమ్మగడ్డ రమేష్ కుమార్ ఉండేదీ హైదరాబాదే. డీజీపీగా పదవీ విరమణ చేస్తే గౌతమ్ సవాంగ్ చేరేదీ హైద్రాబాద్‌కే.

ముఖ్యమంత్రి నివాసం హైదరాబాద్‌లోని లోటస్ పాండ్. ప్రస్తుతానికి మాత్రమే ఆయన తాడేపల్లిలో ఉంటున్నారు. ఆయన తరఫున ఆంధ్ర ప్రభుత్వాన్ని నడుపుతున్న సజ్జల రామకృష్ణారెడ్డి స్వంత ఇల్లు హైదరాబాదే. ఇక, మంత్రులు.. ఎం.ఎల్.ఏలు, ఎం.పిలు, సలహాదారులు, ఛైర్మెన్‌ల స్థిర నివాసాలు అన్నీ హైదరాబాదే.

ఇక, మామూలు జనం విషయానికి వద్దాం. 13 జిల్లాల నుంచి... దాదాపు ప్రతి కుటుంబం నుంచి ఒక్కరైనా హైదరాబాద్‌లో స్థిరనివాసమో, ఉద్యోగమో, సద్యోగమో... వ్యాపారమో... కలిగి ఉన్నవారు ఉండి ఉంటారు. అలా ఎంతమంది ఉండి ఉంటారో ఓ చిన్నపాటి అంచనాకు రావాలంటే... సంక్రాంతికో, దసరాకో... ఖాళీగా దర్శనమిచ్చే హైదరాబాద్ రోడ్లను చూడాలి. ఈగలు దోలుకుంటూ దిగాలుపడి కూర్చునే షాపింగ్‌మాల్స్‌ను చూడాలి. జీహెచ్ఎంసి ఎన్నికలప్పుడు ఆంధ్రావాళ్లను కొనియాడే టీఆర్ఎస్ నాయకులను చూడాలి.

ఆంధ్రలో అక్షరాభ్యాసం చేయిస్తే... స్కూల్లో వేసేది హైదరాబాద్‌లో.

అక్కడ నెల తప్పితే... పురుడుకు వచ్చేది హైదరాబాద్. అక్కడ నవతాడితే... 'ప్రేమ'లో పడి'పోయేది' హైదరాబాద్‌లో. అక్కడ రిటైర్ అయితే.. విశ్రాంతి జీవితానికి చేరేది హైదరాబాద్. అక్కడ తిన్న లంచాలతో- ఆస్తులు కొనుక్కునేది ఇక్కడ. అక్కడ దొంగతనమో... ఛీటింగో, మర్డరో చేస్తే- దాక్కోడానికి వచ్చేది హైదరాబాద్. ఈ రకంగా ఆంధ్రకు చెందిన నాయకులు, ఉప నాయకులు, వినాయకులు, ప్రాక్సీ నాయకులు, అధికారులు, ఉద్యోగులు, దొంగలు, పోలీసులు, ప్లీడర్లు, ముద్దాయిలు, క్రిమినల్సు.... వాళ్ళ గాడ్ ఫాదర్లు.... అందరికీ ఆశ్రయం ఇస్తున్నది హైదరాబాద్ మాత. విజయవాడ కాదు.

మామూలు జనంతో పాటు వాళ్ళ పిల్లా... పాపల జీవనం సైతం హైదరాబాద్‌తో పెనవేసుకుపోయింది. ఇదే తమ 'భాగ్య'నగరమని తెలుగు ప్రజలు భావిస్తున్నారు. వారి ఆర్థిక, సామాజిక, ఆధ్యాత్మిక, ఆత్మీయ కేంద్రంగా - హైదరాబాద్ నగరం తెలుగువారి గుండెల్లో పాతుకుపోయింది. అక్కడ ఎకరం, రెండెకరాలు ఉన్నవాళ్లు, ఇల్లు-వాకిలి ఉంటే-అవి అమ్మేసి హైదరాబాద్ చేరుకున్నవాళ్ళు కోకొల్లలు.

ఇదంతా చంద్రబాబుకు తెలుసు. హైదరాబాద్ నుంచి ఏ ఒక్కరూ ఆంధ్రలో స్థిరపడడానికి వెనక్కి తిరిగి రారని తెలుసు.

అయినా... వరల్డ్ క్లాస్ కాలక్షేపం కోసం- అమరావతి అంటూ- 29 గ్రామాల ప్రజల చెవుల్లో పూలు పెట్టారు.

ఇక, అక్కడినుంచి 13 జిల్లాల జనం చెవుల్లో వరల్డ్ క్లాస్ పువ్వులు పెట్టడానికి సమాయత్తమై పోయి... ఏ దేశంలో పువ్వులు బాగుంటాయో చూసిరావడానికి తన 'సొంత' బ్యాండ్ మేళం టీమ్‌లతో దేశదేశాలు తిరిగారు. ఏ దేశం పూలూ నచ్చలేదు. ఈలోపు దిక్కు మాలిన ఎన్నికలు వచ్చిపడ్డాయి. సరేలే... ఎన్నికలయ్యాక మళ్లీ పూల వేట మొదలెడదాం... వచ్చే యాభైయేళ్ళూ మనమేగా అధికారంలో ఉండేదీ అని చంద్రబాబు అనుకున్నారు.

నిజానికి, 13 జిల్లాల ఆంధ్రకు కావలసింది - పాలనాపరమైన ఒక కాంప్లెక్స్. 500 నుంచి 1000 ఎకరాలుంటే... ఎక్కా, దిక్కాగా సరిపోయేది. కేంద్ర ప్రభుత్వ హోమ్ శాఖ పూర్వపు కార్యదర్శి కే.పద్మనాభయ్య నెత్తీ, నోరూ కొట్టుకున్నారు. సచివాలయం, ముఖ్యమంత్రి... గవర్నర్ కార్యాలయాలు, డీజీపీ కార్యాలయమూ, హైకోర్టు, జడ్జీల నివాస గృహాల సముదాయమూ, శాఖాధిపతుల కార్యాలయాలు, అధికారులు...ఉద్యోగుల నివాస సముదాయాలు- ఇలా మొత్తం సెట్అప్ అంతా ఓ వెయ్యి ఎకరాల్లో ఏర్పాటు చేయవచ్చని ఆయన పదేపదే చెప్పారు. ఈ మాత్రం భూమి ఎక్కడైనా దొరుకుతుంది, ఎప్పుడైనా దొరుకుతుంది.

కానీ, అధికారం చేతిలో ఉంటేమాత్రం చంద్రబాబు- సీతయ్య కదా! ఎవ్వరి మాటా వినరు.

అందుకే- విజ్ఞుల మాట సైతం ఆయన చెవిని పెట్టలేదు. ఒక పక్కన హైదరాబాద్ ఉండగా.. మళ్లీ తెలుగువారికి ఇంకో రాజధాని ఎందుకని కూడా చంద్రబాబు హృదయాంతరాళాల్లో భావించి ఉంటారు. కానీ, నాటకం రక్తి కట్టించడానికి వరల్డ్ క్లాస్ కబుర్లు చెప్పి ఉంటారు..

రోగి కోరుకున్నది.. డాక్టర్ ఇచ్చిందీ ఒక్కటే మందు అన్నట్టుగా- చంద్రబాబు మనస్సులో కోరుకున్నదీ... ఇప్పుడు జగన్ చేస్తున్నదీ అదే.

తెలుగు వారు-వారు ఏ రాష్ట్రంలో ఉన్నా- వారి ఆశలు, ఆకాంక్షలకు, జీవనోపాధికి, సుఖజీవనానికి, చదువు సంధ్యలకు, సాంస్కృతిక... సామాజిక వికాసానికి ఒక్క 'భాగ్య' నగరం చాలు.

అందుకే, అమరావతి...అమరావతి అంటూ-ఆంధ్రాలో ఒక్క కన్నీటి చుక్కా రాలడం లేదు.

**- భోగాది వేంకట రాయుడు**
bhogadirayudu2152@gmail.com

# ప్రతిభ చాటుకున్న కృష్ణచైతన్య విద్యార్థులు

ఇటీవలే విడుదలైన జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో నెల్లూరులోని కృష్ణచైతన్య ఇన్‌స్టిట్యూట్ క్యాంపస్ విద్యార్థులు జాతీయస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనపరచారని ఆ కళాశాల డైరెక్టర్లు డా.ఆర్‌వి కృష్ణారెడ్డి, పి.చంద్రశేఖర్‌రెడ్డిలు పేర్కొన్నారు. తమ కళాశాల విద్యార్థిని సుమశ్రీ జాతీయస్థాయిలో 98.02 పర్సంటైల్‌ను సాధించి అగ్రగామిగా నిలిచిందని తెలిపారు. అదేవిధంగా ఆశ్రిత్‌వర్మ 96.86, పవన్‌సాయి 96.83, హర్షవర్ధన్ 95.3, సాయిహర్షిత్ 93.56, లోక్ అజయ్ 91.58, శివప్రతాప్‌రెడ్డి 91.42 పర్సంటైల్‌ను సాధించారన్నారు. 11 మంది విద్యార్థులు



90 పర్సంటైల్‌కు పైగానే సాధించారని వారు సంతోషం వ్యక్తం చేస్తూ ఆ విద్యార్థులను అభినందించారు. కృష్ణచైతన్య జూనియర్ కళాశాలల డీన్ శిరీష్‌బాబు, అకడమిక్ డీన్ రాంగోపాల్‌రెడ్డి, అడ్మిన్ డీన్ ఉమ తదితరులు పాల్గొన్నారు.

# ఇది జగన్‌కు విషమ పరీక్షే!

(మొదటి పేజీ తరువాయి)

అవకాశాలు ఉన్నాయి. ఈ తలనొప్పులు చాలవన్నట్లుగా రిపబ్లిక్ అనే ఇంగ్లీష్ ఛానల్ ఒకటి.. జగన్‌పైన, వైసీపీపైన రకరకాల కథనాలు ప్రసారం చేయడం రాజకీయ విశ్లేషకులను, పరిశీలకులను ఆశ్చర్యానికి గురిచేసింది. రిపబ్లిక్ ఛానల్‌ను బీజేపీ గొంతుగా పరిగణిస్తుంటారు. అటువంటిది.. వైసీపీపైన, జగన్ పైన ఎందుకు నోరు చేసుకుంటుందనే విషయం ఇప్పుడు ఎవరికీ అంతుబట్టడం లేదు. జగన్ జైలుకు వెళ్లాల్సి వస్తే, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తరువాతి ముఖ్యమంత్రి అంటూ పిన్ పాయింటు చెయ్యడం మరీ ఆశ్చర్యకరంగా కనపడుతోంది. 'నేనే ముఖ్యమంత్రి అయితే... టీడీపీలో చంద్రబాబు తప్ప ఎవరూ మిగలరు..' అంటూ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చెప్పినట్లుగా ప్రచారంలోకి వచ్చిన ఒక వార్త కావాలిసినంత తప్పుడు సంకేతాలను జనంలోకి పంపింది. ఇదంతా ఒక ఎత్తు అయితే పోలవరంపైన గానీ, ప్రత్యేక హోదా గురించి గానీ, హైకోర్టుని కర్నూల్‌కు తరలించాలనే అంశంలో గానీ ముఖ్యమంత్రి జగన్, తన ఢిల్లీ పర్యటనలో హోంమంత్రి అమిత్‌షాకు ఎటువంటి వినతిపత్రం సమర్పించలేదంటూ కేంద్రమంత్రి కటారియా రాజ్యసభలో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు జవాబుగా చెప్పడంతో వైసీపీ ఆత్మరక్షణలో పడిపోయింది.

ఆంధ్రాలో జగన్ పాలన నల్లేరుపై బండి నడకలా సాగిపోతుందనుకుంటున్న సమయంలో ఇవన్నీ కట్టగట్టుకు వచ్చినట్టుగా వచ్చిపడ్డాయి. నిజానికి, తెలుగుదేశంపై ప్రభుత్వం ఎంత కఠినంగా వ్యవహరిస్తే... జనంలో అంతగా జగన్ అనుకూల స్పందన వ్యక్తమైంది కూడా. ఇప్పుడు, విశాఖ ఉక్కు అంశంతో పరిస్థితి కొంచెం మారుతున్నట్టు కనపడుతోంది.

మునిసిపల్ ఎన్నికలు పార్టీ ప్రాతిపదికన జరిగాయి గనుక... పార్టీల పరిస్థితి ఏమిటనేది మరో రెండు, మూడు రోజుల్లో బయటపడిపోతుంది.

విశాఖ ఉక్కు అంశం.. విశాఖ మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికలను ఏమేరకు ప్రభావితం చేసిందనేది రానున్న ఫలితాలతో స్పష్టమవుతుంది. వైసీపీ ఇక్కడ గౌరవప్రదంగా బయటపడకపోతే... విశాఖకు ఎగ్జిక్యూటివ్ కాపిటల్ తరలింపు చిక్కుల్లో పడుతుందని అంటున్నారు. ఇప్పటివరకు, పాలనకు సంబంధించిన వివిధ అంశాలపై రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి గొంతుతో మాట్లాడుతున్నారు. ఇకముందు, తన గొంతుకతోనే మాట్లాడవలసి రావచ్చు.

అధికారంలోకి వచ్చిన దాదాపు రెండు సంవత్సరాల తరువాత, జగన్ తొలిసారిగా ఒక క్లిష్ట రాజకీయ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితులు రాష్ట్ర రాజకీయాలపై ఎటువంటి ప్రభావాన్ని చూపించబోతున్నాయి అన్నది ఇప్పుడే అర్థం కాదు.

# శివ నామస్మరణలతో హోరెత్తిన శైవక్షేత్రాలు

❖ దేదీప్యమానంగా 'మహా శివరాత్రి' వేడుకలు
❖ భక్తులతో క్రిక్కిరిసిన ఆలయాలు

***మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని లయకారుడైన ఆ పరమేశ్వరుని ఆలయాలు ప్రత్యేకపూజలు, విశేష అలంకరణలు, అభిషేకాలతో కళకళలాడాయి. ఈనెల 11వ తేదీ మహాశివరాత్రి పర్వదినం రోజున జిల్లాలోని శైవక్షేత్రాలు శివ నామస్మరణలతో మార్మోగాయి. అనేక శివాలయాల్లో పెద్దఎత్తున వేడుకలు జరిగాయి. ఎంతో విశిష్టమైన లింగోద్భవకాల పూజలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాలు రంగు రంగుల విద్యుద్దీప కాంతులతో వెలుగొందాయి.***

భక్తవరదుడు, భక్తుల కష్టాలు కడతేర్చి కోరిన కోర్కెలు నెరవేర్చే ఆ పరమశివుని ఆలయాలు 'మహా శివరాత్రి' శోభతో దివ్యకాంతులు వెదజల్లాయి. గత కొద్ది రోజులుగా జిల్లాలోని ప్రసిద్ధమైన శైవక్షేత్రాల్లో ఆదిదంపతులకు విశేష అలంకారాలు, విశిష్ట పూజలు చేస్తున్నారు. అనేక ఆలయాల్లో రుద్రయాగాలు, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకాలు నిర్వహించారు.

'మహా శివరాత్రి' రోజున భక్తులు పెద్దసంఖ్యలో ఆలయాలకు తరలివచ్చి 'ఓం నమః శివాయ..' 'హరహర మహాదేవ'.. అంటూ ధ్యానం చుకుంటూ శివ నామస్మరణలు చేస్తూ ఆ పరమేశ్వరుని దర్శించుకుని తరించారు. ఆలయాల్లో ఎంతో వైభవంగా స్వామివార్లకు నిర్వహించిన పూజలు, సేవలను దర్శించుకుని తరించారు.



**నెల్లూరు మూలస్థానేశ్వరాలయంలో :**

నెల్లూరులోని భువనేశ్వరిదేవి సమేత శ్రీ మూలస్థానేశ్వరస్వామికి మహా శివరాత్రి సందర్భంగా విశిష్ట పూజలు, వాహనసేవలు జరిగాయి. వేకువన 2 నుంచి పూజలు, స్వామివారికి పాలాభిషేకాలు నేత్రపర్వంగా నిర్వహించారు. అదే విధంగా నగరంలోని ములుముడి బస్టాండ్ వద్దనున్న భ్రమరాంబ సమేత శ్రీ హరిహరనాథస్వామి ఆలయం, వహాబ్‌పేటలోని శ్రీ ఉమామహేశ్వరస్వామి దేవాలయం తదితర ఆలయాలన్నీ మహా శివరాత్రి శోభతో కళకళలాడాయి.

## వీక్షణం -మంజీర

## తమిళనాడు ఎన్నికలు

# 'షా'క్ తగులుతుందా?

**త**మిళనాడు రాజకీయాలు సులువుగానే అర్థమవుతాయి. ఆ పార్టీల పేర్లే ఒక పట్టాన నోరు తిరగవు. అన్నీ టంగ్ ట్విస్టర్‌లే. మున్నేట్ర, కళగం, కట్చి, మయ్యమ్... ఇలా విఠలాచార్య సినిమాను తలపిస్తాయి. ద్రవిడ లేదా తమిళ అనే పదాలుంటే జనం తమను, తమ పార్టీని ఓన్ చేసుకుంటారు, ఓట్లేసేస్తారు అనేది పార్టీ నాయకుల ఆశ. ఎన్ని కట్చిలు, ఎన్ని కళగాలు ఉన్నా ప్రధాన పోటీ మాత్రం 'అల్ ఇండియా అన్నా ద్రవిడ మున్నేట్ర కళగం– ద్రవిడ మున్నేట్ర కళగం' మధ్యనే ఉండేది. ఎందుకంటే ఆ రెండు పార్టీలను శాసించింది రెండు ఐరావతాలు. ఇద్దరిదీ గజబలమే. తొండాలను మెలి వేసుకుని పట్టుపట్టాయంటే గోడ కూలాల్సిందే తప్ప పోరు ఆగేది కాదు. ఆ గజ ప్రత్యర్థులు జయలలిత, కరుణానిధి. ఆ ఘీంకారానికి భయపడి రాష్ట్రంలోని ప్రాంతీయ పార్టీలే కాదు జాతీయపార్టీలు కూడా దూరదూరంగా జరిగి బిక్కుబిక్కున చూస్తుండేవి. ఆ రాష్ట్రానికి గడచిన అసెంబ్లీ ఎన్నికలు 2016 నాటికి ఆ ఇద్దరు ధీర ప్రత్యర్థులు సమర్థంగా ఎన్నికలను ఎదుర్కొన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 6న జరిగే ఎన్నికలకు ఆ ఇద్దరూ లేకపోవడం పెద్ద లోటు. ఇది ఆయా పార్టీలకు కాదు, ఏకంగా రాష్ట్రానికే తీవ్రమైన లోటు.

**యాభై ఏళ్లు**

తమిళనాడులో జాతీయ పార్టీలు తెరమరుగై రాష్ట్రం ప్రాంతీయ పార్టీల చేతుల్లోకి వచ్చి దాదాపుగా ఐదు దశాబ్దాలైంది. తమిళుల భాషాభిమానమే జాతీయ పార్టీలను దూరం పెట్టింది. ఆ పట్టును కొనసాగించడంలో కరుణానిధి, ఎంజీఆర్, జయలలిత వరకు విజయం సాధిస్తూ వచ్చారు. అవసరార్థం ఏఐఏడీఎంకే, డీఎంకే రెండూ జాతీయ కూటమితో చేతులు కలిపేవి కూడా. ఆ స్నేహం ఎప్పుడూ కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వాల ఏర్పాటుకు, ఆ సంకీర్ణాల మనుగడకు సహాయంగా మాత్రమే ఉండేది. ఏతావాతా తెలుసుకోవాల్సింది ఏమిటంటే... అప్పట్లో చక్రం ఈ ఇద్దరు నాయకుల చేతిలోనే ఉండేది. ఇప్పుడు ఆ పరిస్థితి కొనసాగుతుందా? సందేహమే!

**ఈ ఎన్నికలు ప్రత్యేకం**

ఈ ఏడాది ఎన్నికలు తమిళనాట విచిత్రమైన రాజకీయ చిత్రాన్ని ఆవిష్కరించనున్నాయి. జాతీయ పార్టీలకు తమిళనాడు మీద దృష్టి సారించగలిగిన ధైర్యం వచ్చింది. రాష్ట్రంలో పాగా వేయడానికి పావులు కదుపుతున్నాయి. కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ తమిళనాడులో మూడు రోజులుండి స్కూలు పిల్లలతో ఆడి, బంగాళాఖాతంలో ఈది మొత్తానికి స్టాలిన్ ఇచ్చిన పాతిక సీట్లతో సంతృప్తి చెంది ఢిల్లీ వెళ్లిపోయాడు. పోతూ పోతూ 'తమిళ సంస్కృతి భిన్నం, ఒక భారతీయుడిగా తమిళ సంస్కృతిని గౌరవించడం తన విధి. ఒకే దేశం, ఒకే సంస్కృతి, ఒకే చరిత్ర సిద్ధాంతం తమిళనాడులో వర్తించదని' మోదీ మీద ఒక చురక వేసి మరీ వెళ్లాడు. ఇక బీజేపీ నాయకత్వం మాత్రం ఢిల్లీలోనే కూర్చుని పావులు కదిపింది. అన్నాడీఎంకే ఇచ్చిన ఇరవై సీట్లు చాలవని కినుక వహించింది, కానీ ఇది అలకబూనే సమయం కాదని సర్దుకున్నట్లుంది. అయితే అన్నాడీఎంకేని 170 స్థానాలకు మించనివ్వకుండా వ్యూహరచన చేసింది. శశికళను సెట్ చేసింది. కూటమి పార్టీలన్నీ తమకు ఎక్కువ సీట్లు కావాలని గట్టిగా డిమాండ్ చేయగలిగేటట్లు ప్రోత్సహించింది. జయలలిత ఉండి ఉంటే చిన్న పార్టీల గొంతు పెగిలేది కాదని కూడా మర్చిపోకూడదు. ఒకవేళ ఏ పార్టీ అధ్యక్షుడైనా తలైవి ముందు మోకరిల్లాడంటే అది సీట్ల పంపకం కోసం కాదు, అమ్మ రెండాకుల గుర్తు మీద పోటీ అవకాశం తన పార్టీకి కల్పించమని మాత్రమే. అలాంటి పార్టీలను తన చక్రబంధంలో ఇమిడ్చే ప్రయత్నం చేస్తున్నాడు అమిత్ షా. ఏదో ఒక పార్టీ నీడలో ఉండకుండా సొంత పార్టీతో వ్యక్తిత్వం వికసించిన నాయకులుగా పైకి అంతా స్వతంత్రంగానే కనిపిస్తుంటారు. వాళ్ల వెనుక కనిపించని తాళ్లు అమిత్ షా వేళ్లకు చుట్టుకుని ఉంటాయి. గట్టిగా మాట్లాడడానికి ముఖ్యమంత్రి ఈపీఎస్, ఉప ముఖ్యమంత్రి ఓపీఎస్ ప్రయత్నిస్తుంటారు. కానీ గొంతులు నిశ్శబ్దంగా పెగులుతుంటాయి. ఢిల్లీతో గట్టిగా మాట్లాడాలంటే వాళ్లకు శశికళ గుర్తుకు వస్తుంది. పరప్పన జైలు కూడా. ఏది ఏమైనా రాహుల్ ఎదుట స్టాలిన్‌కి ఉన్నంత మాత్రపు స్వరం కూడా అమిత్ షా ముందు ఈ ముఖ్యమంత్రులకు ఉండడం లేదు. ఇప్పుడు రాష్ట్రంలో ఎన్నికలకు వెళ్తున్నది అన్నాడీఎంకే కూటమి, డీఎంకే కూటమి కాదు. ఎన్‌డీఏ కూటమి, యూపీఏ కూటమి. ఏ కూటమి గెలిచినా తెరవెనుక తాళ్లు అమిత్‌షా వేళ్లలో ఉండే అవకాశమే ఎక్కువ. ఒకప్పుడు ఇలాంటి మాయాజాలం ఢిల్లీ పెద్దవాళ్ల 'చేతి'లో ఉండేది. ఇప్పుడు కమలాన్ని పట్టుకున్న దారం పైకి కనిపించకుండా వేళ్లలో సున్నితంగా ఇమిడిపోతోంది. ఇంతకంటే చెప్పుకోవడానికి ఏమీలేదు. జాతీయ పార్టీలను నివారిస్తూ సాగిన యాభై ఏళ్ల పోరాటం పట్టు సడలుతోందని మాత్రమే చెప్పుకోగలుగుతాం. తమిళనాడు రాజకీయాలను 2016 కు ముందు 2016 తర్వాత అని విశ్లేషించుకోవాల్సి రావచ్చు.

## నివాళి!..



నైతిక, ఆధ్యాత్మిక విలువలకై
జీవితాంతం తపించిన
ఆధునిక రుషి!...
సామాజిక, సాంస్కృతిక రంగాల
చైతన్యానికి కృషిచేసిన
సమాజ శ్రేయోభిలాషి!..

నిరాడంబరతకు మీరే నిర్వచనం
నిర్మల భావతరంగాలే మీ ప్రవచనం
ఎల్లలు లేని సమాజసేవే మీ ధ్యేయం
పావన జీవన గమనమే మీ ఆశయం
మీ జీవితం మాకందరికీ ఆదర్శం!..

గురువు గారూ!...
మీరు లేని లోటు ఎవరూ తీర్చలేనిది.
భౌతికంగా మీరు లేకున్నా
మా గుండెల్లో మీరెప్పుడూ
చిరస్థాయిగా నిలిచే ఉంటారు.

*ఆచార్య ఆదిత్యగారి స్మృతికి.. అశ్రునయనాలతో..*
**బొగ్గరపు రాధాకృష్ణమూర్తి**

# 'నేత్ర సేవకుడు'.. కుప్పయ్య కన్నుమూత

తాము నిరుపేదలైనా నిజాయితీగా సమాజానికి తమవంతు సేవ చేయాలనే తపన ఉన్నవారు నేటికాలంలో బహు కొద్ది మందే ఉంటారు. అలాంటి అరుదైన వ్యక్తుల్లో ఒకరైన కుప్పయ్య మృతిచెందడంతో నెల్లూరు నేత్రదాతల సంస్థ ఎంతో ఆవేదన చెందింది. నెల్లూరులోని లక్ష్మీనగర్ ప్రాంత నివాసి అయిన కుప్పయ్య దాదాపు ఇరవై ఏళ్ళ పాటు నేత్రసేవకునిగా విశిష్టమైన సేవలందించారు. అలాంటి మంచివ్యక్తి దండె కుప్పయ్య తన 91 ఏళ్ల వయసులో ఈనెల 4న కన్నుమూశారు. నెల్లూరు నేత్రదాతల సంస్థ సేకరించిన నేత్రాలను చెన్నైలోని ప్రభుత్వ నేత్రనిధికి, ఇతర నేత్రవైద్య సంస్థలకు ఎప్పటికప్పుడు అందించాలంటే కుప్పయ్య రావాల్సిందే. ఎంతో చిత్తశుద్ధితో ఆ నేత్రాలు ఉంచిన కంటైనర్‌ను పసిబిడ్డలా చేతుల్లో పొదివి పట్టుకుని అత్యంత జాగ్రత్తగా రైళ్ళలో ప్రయాణం చేసి చెన్నైకి వెళ్ళి ఆ బాధ్యతను నిర్వర్తించడంలో ఆయన కాయనే సాటి. 81 సంవత్సరాల వయసులో కూడా ఈ కార్యాన్ని ఎంతో బాధ్యతాయుతంగా నెరవేర్చిన కుప్పయ్య, చివరి దశలో భార్య అనారోగ్యం వల్ల బయట తిరగలేకపోయారు. డబ్బుమీద ఆశలేని మనిషాయన. చేసిన పనికి డబ్బు తీసుకోవాలన్నా ఆయన్ను గట్టిగా ఒప్పించాల్సి వచ్చేది. కుప్పయ్యకు చదవడం, కొద్దిగా రాయడం తెలిసి వుండేది. ఓ చిన్న ప్రైవేటు సంస్థలో కార్యాలయ పనివానిగా, డ్రైవర్‌గా కూడా



పని చేసే వారాయన. పని పట్ల నిబద్ధత గురించి ఆదర్శంగా చూపదగిన వ్యక్తిత్వం ఉన్న పెద్దమనిషి కుప్పయ్య. పండు వృద్ధాప్యంలో కూడా ఆయన నేత్ర దాతల సంస్థకు సేవలందించడం ఆయన సేవాభావానికి నిదర్శనం. కుప్పయ్య మృతి చెందాడని తెలియగానే నెల్లూరు నేత్ర దాతల సంస్థ కార్యదర్శి తిక్కవరపు సుకుమార్‌రెడ్డి ఆయన భౌతికకాయాన్ని సందర్శించి గౌరవపూర్వకంగా నూతన వస్త్రంతో శ్రద్ధాంజలి ఘటించారు.

## శివయ్య నామస్మరణతో..

# విశాఖ తీరాన్ని మార్మోగించిన సుబ్బరామయ్య

### 'మహా శివరాత్రి' నాడు .. కోటిలింగాల మహాకుంభాభిషేకం





*'ఓం నమఃశివాయ, శంభోశంకర, హరహర మహాదేవ'.. అంటూ అచంచలమైన శివశక్తితో మిళితమైన భక్తికెరటం ఉవ్వెత్తున ఎగిసిపడింది. సాగరతీరమంతా శివ నామస్మరణలతో మార్మోగింది. పరమశివునికి పరమభక్తుడు, ఆధ్యాత్మికసేవా తత్పరుడు.. మాజీ ఎంపి మన సుబ్బరామయ్య నేతృత్వంలో విశాఖపట్నం సముద్రతీరం వద్ద 'మహా శివరాత్రి' సందర్భంగా ఏర్పాటు చేసిన బృహత్తరమైన వేదికపై మహా శివలింగ ప్రతిష్ఠతో పాటు, అద్వితీయమైన రీతిలో కోటిలింగాల మహా కుంభాభిషేక మహోత్సవం 'న భూతో.. న భవిష్యతి' అన్నట్లుగా జరిగింది. విశాఖ ప్రజలు తండోపతండాలుగా తరలివచ్చి ఎంతో వైభవంగా జరిగిన 'మహా శివరాత్రి' వేడుకలను కన్నులారా దర్శించుకుని తరించారు.*

మహా శివభక్తుడైన మన నెల్లూరీయుడు, మాజీ ఎంపీ టి.సుబ్బరామరెడ్డి (టిఎస్ఆర్) సారధ్యంలో ప్రతిఏటా జరుగుతున్నట్లుగానే ఈ ఏడాది కూడా లయకారుడైన ఆ పరమేశ్వరునికి ఎంతో ప్రీతి పాత్రమైన మహా శివరాత్రి పర్వదిన వేడుకలు అంగ రంగ వైభవంగా జరిగాయి. ఈనెల 11వ తేది గురువారం 'మహా శివరాత్రి' వేడుకల సంరంభం అంబరాన్నంటింది. సదాశివుని నామజపంతో విశాఖ సాగర తీరం హోరెత్తిపోయింది.

విశాఖ శారదా పీఠం అధిపతులు శ్రీ స్వామి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీవారు, ఉత్తరాధి కారి పూజ్యశ్రీ స్వాత్మానందేంద్రస్వామీజీ వారు పాల్గొని వేదికపై భారీస్థాయిలో ఏర్పాటుచేసిన మహా శివలింగ ప్రతిష్ఠతో పాటు కోటిలింగాల కుంభాభిషేక మహోత్సవాన్ని కూడా వైభవోపేతంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా టిఎస్ఆర్ ఉద్వేగంతో చేసిన శివనామ స్మరణలతో వేదిక ప్రాంగణం మార్మోగి పోయింది. వేదమంత్రాలతో, మంగళవాయిద్యాలతో ఆ సదాశివుని పూజలు అమోఘంగా జరిగాయి. గురువారం రాత్రి ఎంతో విశిష్టమైన లింగోద్భవ కాల పూజలు మరింత వేడుకగా జరిగాయి. టిఎస్ఆర్ పుణ్యమా అంటూ వేలాదిమంది భక్తులు ఈ పూజల్లో ఎంతో భక్తిశ్రద్ధలతో పాల్గొని ఆ దేవ దేవుని కృపాకటాక్షాలకు పాత్రులయ్యారు.

### శివశక్తి.. ఎంతో గొప్పది – టిఎస్సార్

శివశక్తి ఎంతో గొప్పదని, మహా శక్తివంత మైనదని, మహా మహిమాన్వితమైనదని ఈ సంద ర్భంగా టిఎస్ఆర్ అన్నారు. ఆ పరమశివుని కటా క్షంతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఆ మహా దేవుడిని ప్రార్థిస్తున్నానని చెప్పారు. 36 సంవత్సరాల క్రితం ద్రాక్షారామంలో కుంభాభిషేకం నిర్వహించా మని, ఎన్నో ఆటుపోట్ల అనంతరం విశాఖలో ఎంతో వైభవంగా కోటిలింగాలకు కుంభాభిషేకం నిర్వహి స్తున్నామని, ఇదంతా ఆ పరమశివుని అనుగ్రహం వల్ల కలిగిందేనని ఆయన చెప్పారు. కుంభాభిషేకాలు నిర్వహిస్తే ప్రకృతి వైప రీత్యాలు లేకుండా అంతా సుభిక్షంగా ఉంటుందని ఆయన అన్నారు. తాను ప్రతి రోజూ క్రమం తప్పకుండా మూడున్నర గంటల పాటు కఠోర తపస్సు చేస్తానని, శివశక్తి ఈ లోకాన్ని చల్లగా కాపాడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ శివనామ స్మరణ లతో తమ జీవితాలను ధన్యం చేసుకోవాలన్నారు. తొలుత అందరికీ ఆయన 'మహా శివరాత్రి' పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వేడుకల్లో టిఎస్ ఆర్‌తో పాటు అనేకమంది ప్రముఖులు, నాయకులు, ప్రజలతో పాటు కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పి.రమణకుమారి, విజెఎఫ్ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.






Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com